Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

గురువారం
3 అక్టోబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 147
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar

# ధాన్యం టెండర్లలో దగా!

- రైస్ మిల్లుల్లో కనిపించని ధాన్యం
- ధాన్యానికి బదులు డబ్బులివ్వాలని
- మిల్లర్లపై టెండర్ ఏజెన్సీల ఒత్తిడి
- టెండరు ధర కంటే రూ.200 ఎక్కువ ఇవ్వాలని డిమాండ్
- ఇరువర్గాల్లో తెగని పంచాయితీ
- 38 లక్షల టన్నుల్లో 9.5 లక్షల
- టన్నుల ధాన్యం సొమ్ము రికవరీ
- పౌరసరఫరాల సంస్థకు రావాల్సిన 5,700 కోట్ల ఆదాయానికి బ్రేక్



**శుభ తెలంగాణ హైదరాబాద్**

ధాన్యం టెండర్లలో దగా రాజకీయం నడుస్తోంది. వేలం పాటలో 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దక్కించుకున్న కాంట్రాక్టు ఏజెన్సీలు.. రైస్‌మిల్లుల నుంచి వడ్లెత్తకుండా పైసల వసూళ్లకు తెగబడటంతో జరగకూడని అక్రమాలన్నీ జరుగుతున్నాయి. ఇరువర్గాల మధ్య పంచాయితీ వల్ల పౌరసరఫరాల సంస్థకు రావాల్సిన రూ.5,700 కోట్ల ఆదాయానికి బ్రేక్ పడింది. 2022-23 యాసంగి సీజన్‌లో ఈ పంచాయితీ మొదలైంది. రాష్ట్రంలో ధాన్యం నిల్వలు విపరీతంగా పెరగటం, మిల్లింగ్‌లో జాప్యం జరుగుతుండటంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 38 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలంపాటలో అమ్మడానికి - మిగతా3లో



## బీజేపీ నూతన యాక్షన్ ప్లాన్

- నేటి నుంచే రంగంలోకి..
- బాధితులను ఆదుకునేందుకు నేటి నుంచే తమ పోరాటం ఉంటుంది
- పేదలకు అండగా ఉండటం కోసమే మేము చేపట్టేబోయే భవిష్యత్తు ప్రణాళిక ఉంటుంది
- హైడ్రా కూల్చివేతలపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదు

**శుభ తెలంగాణ హైదరాబాద్**

హైడ్రా, మూసీ కూల్చివేతల విషయంలో బీజేపీ కార్యచరణ రేపు(గురువారం) ప్రకటిస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మూసీ సుందరీకరణలో భాగంగా నిర్వాసితులయ్యే బాధితులను ఆదుకునేందుకు నేటి నుంచే తమ పోరాటం ఉంటుందని ఆయన తెలి పారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో బుధవారం కిషన్ రెడ్డి పర్యటించారు. అంబర్‌పేట్, అసెంబ్లీ, ముసారాంబాగ్, అంబేద్కర్ నగర్, తులసి నగర్ మీదుగా కృష్ణానగర్ వరకూ బస్తీలను సంద ర్శించారు. కేంద్రమంత్రి స్వయంగా వెళ్లి నిర్వాసిత కుటుంబాల బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మూసీ నిర్వాసితులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎదుట తమ గోడు - మిగతా3లో



## గిరిజన సమాజం సంక్షేమం, అభ్యున్నతికి కృషి

- 'ధరి ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్'ను ప్రారంభించిన ప్రధాని
- సుమారు 63 వేల గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయి
- 5 కోట్లకు పైగామంది లబ్ధి పొందుతారు
- భగవాన్ బిర్సా ముండా పుట్టిన నేల నుంచి ఈ పథకం ప్రారంభం కావడం ఆనందంగా ఉంది
- 40 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభం కానున్నాయి




## ఢిల్లీలో డ్రగ్స్ కలకలం

- రూ.2వేలకోట్ల విలువైన కొకైన్ సీజ్
- పక్కా సమాచారం మేరకు స్పెషల్ టీం సౌత్ ఢిల్లీలో దాడులు
- నిందితుల నుంచి 560 కిలోలకుపైగా కొకైన్‌ను స్వాధీనం
- ఇద్దరి నుంచి 400 గ్రాముల హెరాయిన్, 160 గ్రాముల కొకైన్ స్వాధీనం

## ఇది మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. మూసీ లూటిఫికేషన్

- మూసీ ప్రాజెక్టు కోసం డబ్బులు ఎక్కడ్నుంచి తెస్తారు..?
- మూసీ విషయంలో సీఎంకు, మంత్రులకు సయోధ్య ఉన్నట్లు లేదు
- మూసీ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లని ఎవరు చెప్పారని శ్రీధర్ బాబు అంటున్నారు
- బుల్డోజర్ ప్రభుత్వంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రాహుల్ ఎక్కడున్నారు..?
- కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు లాంటిది



**శుభ తెలంగాణ హైదరాబాద్**

సీఎం రేవంత్ రెడ్డి చేపట్టింది మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. మూసీ లూటిఫికేషన్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. మూసీ సుందరీకరణపై డీపీఆర్ కాదు.. ప్రాజెక్టు రిపోర్టు కూడా లేదని తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్ చాట్ చేశారు. మూసీ ప్రాజెక్టు కోసం డబ్బులు ఎక్కడ్నుంచి తెస్తారు..? అని కేటీఆర్ నిలదీశారు. మూసీపై రెండు, మూడు రోజుల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాను అని తెలిపారు. మూసీ విషయంలో సీఎంకు, మంత్రులకు సయోధ్య ఉన్నట్లు లేదన్నారు. మూసీ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లని ఎవరు చెప్పారని శ్రీధర్ బాబు అంటున్నారు. అభినవ గోబెల్స్ రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని చెప్పారని - మిగతా3లో



## రాష్ట్రం, దేశం సుఖసంతోషాలతో ఉండాలి

### పాడిపంటలతో వర్ధిల్లాలి: సీఎం రేవంత్

**శుభ తెలంగాణ హైదరాబాద్**

దేశం, తెలంగాణ రాష్ట్రం సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. దుండిగల్‌లోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన ప్రార?నా మందిరాన్ని రేవంత్ బుధవారం ప్రారంభించారు. ఏ కష్టం, నష్టం వచ్చినా దత్తపీఠం ప్రార్ధనాలయంలో కూర్చుంటే తప్పక ప్రశాంతత చేకూరుతుందని విశ్వసిస్తున్నానని - మిగతా3లో

## హైడ్రా వాటినే కూల్చివేస్తోంది

- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని నిర్మాణాలనే కూల్చివేస్తోందని వెల్లడి
- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు 800 చెరువులను కబ్జా చేశారని ఆరోపణ
- రాహుల్ గాంధీకి, హైడ్రాకు సంబంధం లేదన్న పీసీసీ చీఫ్



**శుభ తెలంగాణ హైదరాబాద్**

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని నిర్మాణాలనే హైడ్రా కూల్చివేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 800 చెరువులను కబ్జా చేశారని ఆరోపించారు. అందుకే వారు హైడ్రా కూల్చివేతలకు భయపడుతున్నారన్నారు. అసలు రాహుల్ గాంధీకి, హైడ్రాకు సంబంధం ఏమిటి? అని నిలదీశారు. - మిగతా3లో

## ఇకపై ఆర్టీసీలో అన్ని ఎలక్ట్రిక్ వాహనాలే !

- ఫ్యూయల్ సెల్ పరిశ్రమల ఏర్పాటుకు జపాన్ కంపెనీలకు ఆహ్వానం.
- తోషిబా పరిశ్రమ సందర్శన, పెట్టుబడులకు, ఉమ్మడి భాగస్వామ్యానికి ఆహ్వానం



**శుభ తెలంగాణ హైదరాబాద్**

జపాన్ దేశంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు బుధవారం నాడు తోషిబా ప్రధాన కార్యాలయం మరియు పరిశ్రమల సందర్శన, ఫ్యూయల్ సెల్ విభాగాలఏర్పాటు, తదితర అంశాలపై సమావేశాలతో బిజీ బిజీగా గడిపారు. ఉదయం 8 గంటలకు ఆయన టోక్యో నగరం నుండి బయలుదేరి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న - మిగతా3లో



## ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు వద్దు..

- భారతీయులకు సూచన
- ఇజ్రాయెల్‌పై ఇరాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు
- ఆ దేశంలో ఉన్న భారతీయ పౌరులు అప్రమత్తంగా ఉండాలి
- సహాయ సహకారాల కోసం టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలి
- పరిస్థితులు, భద్రతా పరిస్థితిలో తీవ్రతను భారత ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది

# 75 వసంతాల చైనా







75 ఏళ్ల కిందట, 1949, అక్టోబర్ 1న చైనాలో ప్రజారాజ్యం ఏర్పాటును ప్రపంచానికి ప్రకటించాడు, మావో జెడాంగ్. తాము పురుడుపోసిన ఈ నూతన సమాజానికి, 'సోషలిస్ట్ రిపబ్లిక్' అన్నపేరు పెట్టలేదు. ఈ సరికొత్త చైనాకి పీపుల్స్ రిపబ్లిక్ అని నామకరణం చేశారు కమ్యూనిస్టులు. ఇప్పుడే ఏర్పడిన ఈ ప్రజారాజ్యం, వెనువెంటనే సామ్యవాద దేశంగా మారబోదన్నది చైనా కమ్యూనిస్టు పార్టీ అంచనా. 1931లో జపాన్ సామ్రాజ్య వాదులు ఉత్తర చైనాను ఆక్రమించినప్పుడు మొదలై పద్దెనిమిదేళ్ల పాటు మండిన యుద్ధపు మంటల్లో కోటి 50 లక్షల మంది బలయితే, ఆ శిధిలాలపై కొత్త రాష్ట్రాన్ని, సమాజాన్ని నిర్మించడానికి నడుముకట్టిన కమ్యూనిస్టులకు సామ్యవాద సమాజానికి దారితీసే ఆ తోవపై దశాబ్దాల ప్రయాణం ముందున్నదన్న విషయంపై ఆనాడే స్పష్టత ఉంది.'ఇకపై చైనా ప్రపంచంలో శాంతి, స్వేచ్ఛలని కోరుకునే ప్రపంచ దేశాలన్నిటికీ చెందుతుంది' అని 1949, సెప్టెంబర్ 21న జరిగిన చైనా ప్రజా రాజకీయ సంప్రదింపుల సభ (చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్) మొదటి ప్లీనరీ సమావేశంలో మావో ఎలుగెత్తి చాటాడు.

ఒడిదుడుకులకు తలొగ్గక, శాయశక్తులా తమ నాగరికత అభివృద్ధికి, ప్రజాశ్రేయస్సు పెంపునకు పాటు పడుతూనే; నూతన చైనా ప్రపంచశాంతి, స్వేచ్ఛలకి దన్నునిస్తుందని ప్రకటించాడు. 'మనం సగర్వంగా నిలబడ్డాం! ఇకపై అవమానాలు, తలవంపుల కింద మన దేశం నలగబోదు' అని ఉద్ఘాటించాడు. ఆ సభలో మావో అన్నమాటలు, ఆనాడు ప్రపంచమంతటా జరుగుతున్న సామ్రాజ్య వాద వ్యతిరేక ఉద్యమాల ఆశయాలకు ప్రతిబింబం. భారతదేశంలో నెహ్రూ కాని, ఈజిప్టులో గమాల్ అబ్దుల్ నాస్సర్ కాని, ఆనాటి వలసపాలన వ్యతిరేక జాతీయోద్యమ నాయకులందరి గొంతుల్లో, ఇవే భావాలు పలికేవి. వలసపాలన అవశేషాలు మిగలకుండా ముగియడానికి ప్రపంచశాంతి, సమతలు ఎంతైనా అవసరం. శాంతి, సమతల నీడనే, ఉక్కుపాదం కిందనుండి బయటపడిన ప్రజలు తమ కాళ్ల మీద తాము నిలబడగల సమాజాల్ని నిర్మించుకోగలరు. 2024లో, ఆనాడు మావో ఇచ్చిన సందేశం నెమరువేసుకుంటూ, మనచుట్టూ చూస్తే –వలసపాలన నుండి స్వాతంత్ర్యం సాధించిన దేశాలు ఎన్ని ముందడుగులు వేశాయో, అదే సమయంలో, ఎంత మొండిగా అవే వలసవాద, సామ్రాజ్యవాద శక్తులు ఇప్పటికీ ఈ దేశాల ప్రగతిని అడ్డగిస్తున్నాయో కనిపిస్తుంది. ఈ రోజు పాలస్తీనా ప్రజలపై జరుగుతున్న మారణ కాండ, ఇజ్రాయిల్ చేతిలో భీకరమైన బాంబు దాడులకి గురవుతున్న లెబనాన్ ? మనల్ని, తునకలు చేసి బయటికి రావాలనుకున్న వలస వాద గతంలోనే కట్టి ఉంచు తున్నాయి. సామ్రాజ్యవాద దేశాలు మనపై రద్దుతున్న యుద్ధాలు, మావో వక్కాణించిన 'నాగరికతల అభివృద్ధి, ప్రజా శ్రేయస్సు', 'ప్రపంచ శాంతి, స్వేచ్ఛ' లకు అడ్డంకులు. వలసవాదం కింద నలిగిన బయటపడిన దేశాల ముందు రెండు దారులున్నాయి. ఒకరినొకరు ప్రత్యర్థులుగా చూస్తూ, మన సంపద, శక్తులని వినాశకర యుద్ధాలకి తగలపెట్టడమా, లేక మావో అన్నట్లు స్వేచ్ఛాప్రియ దేశాలతో అంతర్జాతీయ శాంతికాముక సమాజాన్ని నిర్మించడమా! సామ్రాజ్యవాద దేశాల కంపెనీలకు అతి చౌక ధరల్లో ముడి వస్తువులు సరఫరా చేయడానికి ఒకరితో ఒకరు పోటీ పడుతున్న మూడవ ప్రపంచ దేశాలు, తమ శ్రామికుల వేతనాలు తొక్కిపెడితే ? వారి శ్రమని దోచి బహుళ జాతి కంపెనీలు భారీ ఎత్తున లాభాలు ఆర్జిస్తున్నాయి. ప్రపంచ కార్మికులని దోచి కూడగట్టిన ఈ లాభాలని కొత్త టెక్నాలజీల అభి వృద్ధిపై వెచ్చించి, తమదేశాల ఉత్పత్తి శక్తుల్ని బలపరచుకుంటూ, టెక్నాలజీ పోటీలో ముందుంటూ, ఆధిపత్యం చెలాయిస్తున్న వీటి గుప్పిటనుండి మూడో ప్రపంచ దేశాలు బయటపడి, స్వయం ప్రతిపత్తి పెంచుకోవడం ఎలా? చాలీచాలని వేతనాలు, కొనుగోలు శక్తి లేని ఆర్థిక వ్యవస్థలో చిక్కుకున్న ఈ దేశాలు, అభివృద్ధికి అవసరమైన వనరులు ఎలా సమకూర్చుకుంటాయి? ఈ సమస్యని అధిగమించడానికి చైనాతో సహా, కొన్ని దక్షిణాది దేశాలు తమ తమ మార్గాలు ఎంచుకున్నాయి. ఈ విషయంలో చైనా అనుభవం చర్చించ దగ్గది. విప్లవం తరువాత చైనా తన దగ్గర ఉన్న కొద్దిపాటి వనరులు నేర్పుగా కూడగట్టుకుని, సోషలిస్ట్ రష్యా సహాయంతో పాత భూస్వామ్య వ్యవస్థను పెకిలించి, కొత్త వ్యవసాయిక వ్యవస్థకి పునాదులు వేసి, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే విద్య, వైద్య వ్యవస్థలని దేశవ్యాప్తంగా నిర్మించి జీవన ప్రమాణాల్ని మెరుగుపరిచింది. 1949, 1978 మధ్య సమయం చైనా అభివృద్ధి మొదటి దశ. ఈ కాలంలో చైనాలో ఏర్పడిన సమానత్వంవల్ల , విద్యావంతులై, ఆరోగ్యంతో ఉన్న జనాభా నిష్పత్తి తక్కిన మూడో ప్రపంచ దేశాల కన్నా చాలా ఎక్కువగా ఉండేది. రెండవ దశలో 1979 నుండి, విద్య, నైపుణ్యం, ఆరోగ్యాలలో ముందున్న ఈ శ్రామికవర్గం ఆధారంగా చేసుకుని ప్రభుత్వం బహుళ జాతి కంపెనీల పెట్టుబడులని ఆకర్షించింది. ప్రణాళికాబద్ధంగా, సాంకేతిక పరిజ్ఞానం స్థానిక కంపెనీల చేతిలోకి మారేట్లుగా, చైనాలోకి పెట్టుబడి తెచ్చిన విదేశీ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. దేశ కరెన్సీ వినమయ ధరని మార్కెట్ శక్తులకి వదిలేయకుండా, ప్రభుత్వం అదుపు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలను ఈ నూతన సాంకేతిక అభివృద్ధిలో భాగంగా చేసింది. ఉదారవాద అంత ర్జాతీయ వ్యవస్థ పరిధిలో ఉంటూనే, సాంకేతిక పరిజ్ఞానం కోసం సామ్రాజ్యవాద దేశాలపై ఆధారపడే అవసరాన్ని అధిగమించి చైనా సాధించిన గణనీయమైన ఆర్థిక, సాంకేతిక అభివృద్ధులకు కారణం పైన తెలిపిన ప్రణాళికలు.

# జాట్లదే ప్రాబల్యం.. బీజేపీపై గుర్రు.. కాంగ్రెస్‌కు కలిసొచ్చేనా





**చండీగఢ్:** హరియాణా అసెంబ్లీకి అక్టోబర్ 5న ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్రంలో జాట్ల ప్రాబల్యం చాలా ఎక్కువ. ఇప్పుడు ఈ సామాజిక వర్గమే బీజేపీకి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మరోవైపు జాట్ ఓట్లను పూర్తిగా తమ వైపు తిప్పుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. గంపగుత్తగా జాట్ల ఓట్లు ఎవరికి వెళ్తాయనేది ఆసక్తికరంగా మారింది.


**బీజేపీపై ఆగ్రహం..**

జాట్‌ల ప్రాబల్యం బీజేపీకి ఇబ్బందిగా మారింది. కాషాయ పార్టీ తమను నిర్లక్ష్యం చేసిందని, పదేళ్లపాటు ముఖ్యమంత్రి పదవిని తమ వర్గానికి దూరం చేసిందనే కోపం జాట్లలో ఉంది. రైతుల ఆందోళనలను బీజేపీ అణచివేసిందనే ఆలోచన జాట్ సామాజిక వర్గంలో బలంగా పాతుకుపోయింది. మొత్తం 90 నియోజకవర్గాల్లో 37 చోట్ల జాట్‌లదే ఆధిపత్యం. వారు ఏ పార్టీకి మద్దతుగా నిలిస్తే ఆ పార్టీ విజయం సాధించడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత సైన్య నియామకానికి కొత్తగా తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకం జాట్‌లకు నచ్చలేదు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కోసం రైతులు చేస్తున్న ఆందోళనలను పట్టించుకోకపోవడం, రెజ్లర్ల ఆందోళనలను అణచివేయడానికి యత్నించడం, మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తొలగించినప్పుడు జాట్ నేతకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వకపోవడం ఇలాంటివన్నీ బీజేపీపై వ్యతిరేకతను పెంచాయి. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్ లాల్ ఖట్టర్‌ను మార్చి ఓబీసీ నేత సైనీని బీజేపీ తీసుకొచ్చింది. తమ వర్గానికి చెందిన నేతను ముఖ్యమంత్రిని చేయలేదనే కోపం జాట్ నేతల్లో మరింతగా బలపడింది. జాట్‌లు ఆగ్రహంగా ఉన్నారని గుర్తించిన బీజేపీ.. జాటేతర ఓట్లపై దృష్టి సారించింది. దీంతో జాటేతర అభ్యర్థులకు అధికంగా టికెట్లిచ్చింది. 2019లో 19, 2014లో ఇచ్చిన 24 మంది జాట్ అభ్యర్థులను బరిలోకి దింపగా.. ఈసారి కేవలం 16 మందినే నిలబెట్టింది. హరియాణాలో ఓబీసీలు 30 శాతం ఉంటారు. గణనీయ సంఖ్యలో ఉన్న ఓబీసీ ఓటర్లను ఆకట్టుకోవడం ద్వారా జాట్ల ద్వారా వచ్చే నష్టాన్ని భర్తీ చేయొచ్చని బీజేపీ భావిస్తోంది. కాంగ్రెస్‌కు జాట్‌లతోపాటు ముస్లింలు మద్దతుగా నిలుస్తున్నారు. బీజేపీ ధోరణి ఆ పార్టీకి కలిసొస్తోంది. జాట్లు, ముస్లింల ఓట్లు గంపగుత్తగా కాంగ్రెస్‌కు పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**తిరుగుబాటు సమస్య**

టికెట్ ఆశించి భంగపడ్డ వారు సొంత పార్టీలపై తిరుగుబాటు చేసి స్వతంత్రంగా బరిలోకి దిగారు. దాదాపు 20 నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు తిరుగుబాటుదారులు తలనొప్పిగా మారారు. బలమైన పోటీనిస్తే ఓట్లు చీలి ఎవరికి లాభిస్తుందోననే ఆందోళన అన్ని పార్టీల్లో ఉంది.

# న్యూఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం వద్ద బలగాలు మోహరింపు



**టెహ్రాన్ :** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతుంది. మంగళవారం ఇజ్రాయెల్‌పై ఇరాన్ భారీగా క్షిపణి దాడులకు దిగింది. ఇటువంటి పరిస్థితుల్లో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని భారతీయ రాయబార కార్యాలయం అక్కడి భారతీయులకు బుధవారం కీలక సూచన చేసింది. అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించింది. స్థానిక అధికారులు సూచించిన ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఇరాన్‌లోని భారతీయులకు విజ్ఞప్తి చేసింది. అలాగే ఏదైన అత్యవసరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు రాయబార కార్యాలయంలోని అధికారులతో సంప్రదించాలని స్పష్టం చేసింది. దేశంలోని తాజా పరిస్థితులను తమ కార్యాలయం ఎప్పటికప్పుడు గమనిస్తుందని టెహ్రాన్‌లోని భారతీయ రాయబార కార్యాలయం తెలిపింది. ఇక ఇజ్రాయెల్ రాజధాని టెలి అవివ్‌లోని భారతీయ రాయబార కార్యాలయం మంగళవారం ఇదే తరహా ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. దేశంలో నెలకొన్న తాజా పరిస్థితుల నేపథ్యంలో భారతీయులు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అవసరమైతే తప్ప బయటకు వెళ్ల వద్దని పేర్కొంది. స్థానిక అధికారులు సూచించిన ఆదేశాలకు తూచా తప్పకుండా పాటించాలని దేశ వాసులకు ఇజ్రాయెల్‌లోని భారతీయ రాయబార కార్యాలయం సూచించింది. అత్యవసర సమయాల్లో అవసరమైతే రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలంటూ 972-547520711, o972-543278392 ఫోన్ నెంబర్లను సైతం అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఇక దేశంలోని పరిస్థితులను తమ కార్యాలయం ఎప్పటికప్పుడు గమనిస్తుందని స్పష్టం చేసింది. మరోవైపు ఇజ్రాయెల్‌పై మంగళవారం ఇరాన్ దాదాపు 180 మిసైళ్లతో దాడి చేసింది. వాటిలో చాలా భాగం మిసైళ్లను ఇజ్రాయెల్ నాశనం చేసిన విషయం విధితమే. ఇక ఇరాన్, ఇజ్రాయెల్‌లోని ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఈ రెండు దేశాల యా దేశాలకు వెళ్లే ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని భారతీయులకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సూచించింది. ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో 18 వేల మంది భారతీయులు నివసిస్తున్నారు. ఇక ఇరాన్‌లో 5 నుంచి 10 వేల మంది భారతీయులు ఉన్నారని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గణాంకాలను వెల్లడించింది. ఇంకోవైపు దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం వద్ద భద్రతను పెంచారు. గతంలో అంటే.. 2021, 2023లో బాంబు పేలుళ్లు సంభవించాయి. అదికాక.. ఇజ్రాయెల్‌పై ఇరాన్ మిసైళ్ల దాడికి నిన్న తెగబడింది. దీంతో భారత ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా అప్రమత్తమైంది. ఆ క్రమంలో మన దేశంలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం వద్ద భారీగా బలగాలను మోహరించారు.

## ఢిల్లీలో డ్రగ్స్ కలకలం..



దేశ రాజధాని ఢిల్లీ నగరంలో అంతర్జాతీయ డ్రగ్ స్మగ్లింగ్ ముఠాగుట్టు రట్టయ్యింది. 500 కిలోల కొకైన్‌ను ఢిల్లీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విలువ రూ. 2వేలకోట్లకుపైగా ఉంటుందని అంచనా. ఈ కేసులో నలుగురు నిందితులను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ అరెస్టు చేసింది. పక్కా సమాచారం మేరకు స్పెషల్ టీం సౌత్ ఢిల్లీలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 560 కిలోలకుపైగా కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నామని.. మార్కెట్‌లో విలువ రూ. 2వేలకోట్లు ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం పోలీసులు నిందితులను విచారిస్తున్నారు. ఇటీవల పోలీసులు డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని.. ఇద్దరు ఆఫ్ఘన్లను అరెస్టు చేశారు. ఇద్దరి నుంచి 400 గ్రాముల హెరాయిన్, 160 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. ముఠా గుట్టురట్టయ్యింది.

## గిరిజన సమాజం సంక్షేమం, అభ్యున్నతికి కృషి




జాతిపిత మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ (బుధవారం) మరో ముఖ్యమైన పథకాన్ని ఆవిష్కరించారు. జార్ఖండ్‌లో 'ధరి ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్'ను ఆయన ప్రారంభించారు. ఏకంగా రూ. 80 వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన ఈ పథకం కింద 5 కోట్ల మంది ప్రజలు ప్రయోజనం పొందనున్నారు. ఈ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ధరి ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్' కింద సుమారు 63 వేల గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, 5 కోట్లకు పైగామంది లబ్ధి పొందుతారని తెలిపారు. " సుమారు రూ. 80,000 కోట్ల నిధులతో ధరి ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్‌ను ప్రారంభించాను. సుమారు 63 వేల గిరిజన గ్రామాల అభివృద్ధిని కవర్ చేస్తుంది. సుమారు 5 కోట్ల మంది ప్రజలు ప్రయోజనం పొందుతారు. భగవాన్ బిర్సా ముండా పుట్టిన నేల నుంచి ఈ పథకం ప్రారంభం కావడం ఆనందంగా ఉంది" అని ప్రధాని మోదీ చెప్పారు. గిరిజన యువతకు చక్కటి విద్యావకాశాలు లభించినప్పుడే గిరిజన సమాజం అభివృద్ధి చెందుతుందని, అందుకే గిరిజన ప్రాంతాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. 40 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభం కానున్నాయని, ఇప్పటికే 25 స్కూల్స్‌కు శంకుస్థాపన జరిగిందని అన్నారు. ధరి ఆబాబ జనజాతీయ గ్రామ్ ఉత్కర్స్ అభియాన్ కాకుండా.. జార?ండ్‌లోని హజారీబాగ్‌లో మరో రూ. 83,300 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కాగా 17 రోజుల వ్యవధిలో ప్రధాని మోదీ జార్ఖండ్‌లో పర్యటించడం ఇది రెండవసారి. ఇక జార్ఖండ్ అభివృద్ధి కార్యక్రమాలపై ఎక్స్ వేదికగా కూడా మోదీ స్పందించారు. జార్ఖండ్ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వామిని అయ్యే అవకాశం ఇవాళ మరోసారి నాకు దక్కింది. కొన్ని రోజుల క్రితమే నేను జంషెడ్‌పూర్‌కు వచ్చాను. వందల కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించాను. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద జార?ండ్‌లోని వేలాది మంది పేదలకు సొంత పక్కా ఇళ్లు లభించాయి. ఇక రోజుల వ్యవధిలోనే జార?ండ్‌లో రూ. 80 వేల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఈ పథకాలు గిరిజన సమాజం సంక్షేమం, అభ్యున్నతికి సంబంధించినవి" అని ఎక్స్‌లో మోదీ పేర్కొన్నారు.

## ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు వద్దు



**న్యూఢిల్లీ:** ఇజ్రాయెల్‌పై ఇరాన్ భారీ స్థాయిలో క్షిపణులతో దాడుల నేపథ్యంలో ఆ రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం సూచలను జారీ చేసింది. ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు వద్దని భారతీయులకు సూచించింది. ఆ దేశంలో ఉన్న భారతీయ పౌరులు అప్రమత్తంగా ఉండాలని కోరింది. సహాయ సహకారాల కోసం టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కోరింది. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు, భద్రతా పరిస్థితిలో తీవ్రతను భారత ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. భారతీయ పౌరులు ఇరాన్‌కు అనవసరమైన ప్రయాణాలను నివారించాలని సూచించారు. ప్రస్తుతం ఇరాన్‌లో నివసిస్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని, టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. కాగా, ఇజ్రాయెల్ ముఖ్య నగరమైన టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా అక్కడున్న భారతీయులకు తగిన సూచనలు జారీ చేసింది. భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు నివారించాలని, బయటకు రావద్దని, సురక్షిత షెల్టర్లలో ఉండాలని పేర్కొంది.

## గుట్కా తిని రోడ్డుమీద ఉమ్మేసే వాళ్లను ఇలా కట్టడి చేయొచ్చు... చిట్కా చెప్పిన గడ్కరి



**నాగపూర్:** గుట్కాలు తిని రోడ్ల మీద ఉమ్మేసే వాళ్లను కట్టబడి చేయడానికి కేంద్రం మంత్రి నితిన్ గడ్కరి ఓ చక్కటి ఐడియా ఇచ్చారు. పాన్, మషాలా, గుట్కాలు తిని రోడ్లమీద ఉమ్ములు వేసే వాళ్ల ఫోటోలు తీసి వార్తాపత్రికల్లో ప్రచురించాలని సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా నాగపూర్ మున్సిపల్ కార్పొరేషన్ బుధవారంనాడు నిర్వహించిన 'స్వచ్ఛ భారత్' కార్యక్రమంలో గడ్కరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బహిరంగ ప్రవేశాల్లో చెత్తాచెదారం పడేసే వాళ్లకు కూడా మంత్రి చురకలు వేశారు."మన దేశ ప్రజలు చాలా తెలివైన వాళ్లు. చాక్లెట్లు తిని దాని రేపర్లు రోడ్లపైనే పడేస్తుంటారు. ఇదే వ్యక్తి విదేశాలకు వెళ్లినప్పుడు చాక్లెట్ కాగితాలు జేబులో పెట్టుకుని హుందాగా వ్యవహరిస్తుంటారు. ఇక్కడ మాత్రం రోడ్లపై పడేస్తుంటారు" అని నవ్వుతూ చురకలు వేశారు. ఇందుకు చిన్నప్పుడు తానే ఒక ఉదాహరణ అంటూ కూడా చెప్పుకొచ్చారు. అప్పట్లో తాను కూడా చాక్లెట్ పేపర్లు బయటకు విసిరేసే వాడినని, అయితే ఇప్పుడు ఆ పద్ధతి మార్చుకున్నానని చెప్పారు. ఇప్పుడు తాను చాక్లెట్లు తింటే రేపర్ ఇంటికి వచ్చాక పారేస్తుంటానని చెప్పారు.

## స్వచ్ఛతా కార్యక్రమంలో ప్రధాని



గాంధీ జయంతి సందర్భంగా 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాలను బుధవారంనాడు దేశవ్యాప్తంగా చేపట్టారు. ఏటా ప్రభుత్వం, ఇతర సంస్థలు స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పండారీ పార్క్‌లోని ఒక పాఠశాలలో స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్ని బ్రూమ్‌స్టిక్‌తో పరిసరాలను శుభ్రపరిచారు. పార్లమెంటు ఆవరణలో జరిగిన స్వచ్ఛతా కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పాల్గొన్నారు.

# ధాన్యం టెండర్లలో దగా!

-మొదటిపేజీ తరువాయి

టెండర్లు పిలిచింది. టెండర్లలో పాల్గొన్న 4 కాంట్రాక్టు ఏజెన్సీలు క్వింటాలుకు రూ.1,700 చొప్పున బిడ్డింగ్ కోట్ చేయటంతో.. పౌరసరఫరాల సంస్థకు భారీ నష్టం వస్తుందని భావించి టెండర్లు రద్దు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. ప్రభుత్వం టెండర్ల ఫైలును మళ్లీ కదిలించింది. సగటున క్వింటాలుకు రూ.2 వేలు టెండరు రేటు వచ్చింది. ఈ ప్రభుత్వంలో కూడా ఆ నాలుగు ఏజెన్సీలే టెండర్లను దక్కించుకున్నాయి. 38 లక్షల టన్నుల ధాన్యాన్ని 12 లాట్లుగా విభజించి టెండర్లు పిలవగా.. హిందూస్థాన్ ఎంటర్ ప్రైజెసకు ఒకటి, కేంద్రీయ భండార్‌కు నాలుగు, మంచుకొండ ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఒకటి, న్యాకాఫ(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ ప్రొక్యూర్మెంట్ ప్రాసెసింగ్– రిటైలింగ్ కో ఆపరేటివ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్)కు ఆరు లాట్లు దక్కాయి. పే అండ్ లిఫ్టింగ్ విధానంలో మూడు నెలల్లో రైస్‌మిల్లుల నుంచి ధాన్యం నిల్వలు ఖాళీ చేయాలనే నిబంధన ఉండగా.. ఇప్పటికీ తొమ్మిది నెలలు గడిచినా ఖాళీ చేయలేదు. వాస్తవానికి వేలం పాటలో ధాన్యం కొనుగోలు చేసిన ఏజెన్సీలు.. ఆ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముకోవాలి. లేకపోతే మిల్లింగ్ చేయించుకొని బియ్యం అమ్ముకోవాలి. కానీ కేవలం పైసల వసూళ్లపైనే కాంట్రాక్టర్లు దృష్టి పెట్టారు. అయితే టెండర్ల ప్రక్రియ పూర్తికాకముందే.. కొందరు రైస్‌మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ఎలాంటి బ్యాంకు గ్యారెంటీ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం ఇవ్వటం, టెండర్ల పనిలో పడి మిల్లింగ్‌కు ఆదేశాలు ఇవ్వకపోవటంతో.. రైస్ మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ చేయకుండా ధాన్యాన్ని తెగనమ్ముకున్నారు. టెండర్ల సమయంలో ఫిజికల్ వెరిఫికేషన్ చేయిస్తే.. చాలా రైస్‌మిల్లుల్లో ధాన్యం కనిపించలేదు. ఇదే అదనుగా భావించిన టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు ధాన్యానికి బదులుగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే అప్పటి ఎమ్మెస్పీ రేటు ప్రకారమైనా, టెండర్ రేటు ప్రకారమైనా.. (సగటున క్వింటాలుకు రూ.2 వేలు) డబ్బులు చెల్లించేందుకు మిల్లర్లు ముందుకొచ్చారు. కానీ క్వింటాలుకు అదనంగా రూ.223 చొప్పున చెల్లించాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేయటంతో పంచాయితీ మొదలైంది. అధికారబలంతో మిల్లర్లపై ఒత్తిడి చేసి, కేసుల్లో ఇరికించటంతో.. 9.50 లక్షల టన్నుల ధాన్యానికి మిల్లర్లు డబ్బులు చెల్లించారు. కాంట్రాక్టర్లు ఒక్క వడ్ల గింజ కూడా ఎత్తకుండా రూ.2,112 కోట్లు వసూలు చేశారు. ఇందులో రూ.1,900 కోట్లు పౌరసరఫరాల సంస్థకు చెల్లించారు. మిగిలిన రూ.212 కోట్లు కాంట్రాక్టర్లు లబ్ధి పొందారు. వాస్తవానికి 38 లక్షల టన్నుల ధాన్యం విక్రయాల ద్వారా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు రూ.7,600 కోట్ల ఆదాయం రావాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.1,900 కోట్లు మాత్రమే రికవరీ అయ్యింది. ఇంకా రూ.5,700 కోట్లు రికవరీ కావాల్సిఉంది.

### మిల్లర్ల రివర్స్ గేర్.. కాంట్రాక్టర్ల కలెక్షన్ రూల్

2022–23 యాసంగి ధాన్యం టెండర్లు కొలిక్కిరావటానికి ఏడాదికి పైగా సమయం దొరకటంతో రైస్‌మిల్లర్లు రివర్స్ గేర్ వేశారు. 2023–24 ఖరీఫ్, యాసంగి సీజన్లలో రైతుల నుంచి మిల్లర్లు నేరుగా ధాన్యం కొనుగోలు చేశారు. గతంలో అమ్ముకొని సొమ్ము చేసుకున్న ధాన్యాన్ని కొందరు మిల్లర్లు ఏవో తంటాలు పడి భర్తీ చేశారు. మరికొందరు రైస్ మిల్లర్లు 2022– 23లో ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని అమ్మకుండా అలాగే పెట్టారు. ధాన్యం తీసుకుంటే అప్పగిస్తాం.. పైసలు మాత్రం ఇచ్చేదిలేదు అని మొండికేశారు. అయితే రైస్ మిల్లర్లు క్వింటాలుకు రూ.2,223 చొప్పున డబ్బులు చెల్లించటానికి మొండికేస్తుండటంతో.. కాంట్రాక్టర్లు తాజాగా క్వింటాలుకు రూ.23 చొప్పున రేటు తగ్గించారు. క్వింటాలుకు రూ.2,200 చొప్పున డబ్బులు చెల్లించాలని మిల్లర్లపై ఒత్తిడి చేస్తున్నారు. ఇంకా 28.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన లావాదేవీలు నిలిచిపోయాయి. హిందుస్థాన్ ఎంటర్ ప్రైజెస్ ఒక్క శాతం కూడా ధాన్యం లిఫ్ట్ చేయలేదు. కేంద్రీయ భండార్ 27శాతం, మంచుకొండ ఆగ్రోటెక్ 36శాతం, న్యాకాఫ్ 21శాతం కలిపి.. సగటున 24శాతం ధాన్యం టార్గెట్ ఇప్పటివరకు పూర్తయ్యింది. ఇంకా 76శాతం ధాన్యం లిఫ్టింగ్ పూర్తికావాల్సి ఉంది.

# ఇకపై ఆర్టీసీలో అన్ని ఎలక్ట్రిక్ వాహనాలే !

-మొదటిపేజీ తరువాయి

ప్రముఖ బహుళ జాతి ఎలక్ట్రానిక్ మరియు ఎలక్ట్రికల్ ఉత్పత్తుల దిగ్గజ కంపెనీ తోషిబా వారి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు ఆయనతో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి శ్రీ రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండీ శ్రీ ఎన్.బలరామ్, భారత రాయబార కార్యాలయ అధికారులు బన్సల్ శ్రీమతి దేవజాని సందర్శనలో పాల్గొన్నారు.



తోషిబా ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ ఉన్నతాధికారి శ్రీ హిరోషి కనేట, వైస్ ప్రెసిడెంట్ శ్రీ షిగే రిజో కవహర, శ్రీ కనేట తదితర ఉన్నతాధికారులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి, అధికారులకు ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తోషిబా ఉత్పత్తుల సేవలను వారు వివరించారు. ప్రధానంగా ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తి కంపెనీ అయిన తోషిబా ఇప్పుడు పర్యావరణహిత సోలార్ ఉత్పత్తులలో అగ్రగామిగా ఉందని వివరించారు. ముఖ్యంగా, సోలార్ విద్యుత్తులో వినియోగించే ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్ తయారీ, ఫ్యూయల్ సెల్ ,బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీ, శక్తివంతమైన జనరేటర్లు, జీరో కార్బన్ ఎమిషన్ టెక్నాలజీలను వృద్ధి చేశామని సంబంధిత వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ తెలంగాణలో పెద్ద ఎత్తున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నామని, దీనికి ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్ కూడా పెద్ద సంఖ్యలో కావలసి ఉందని, అలాగే రానున్న కాలంలో ఫ్యూచర్ సిటీలో ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ వినియోగం ఎక్కువగా ఉంటుంది కనుక రాష్ట్రంలో సంబంధిత యూనిట్ లను ఉమ్మడి భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని కోరారు. విద్యుత్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించే ఆధునిక జనరేటర్లు, విద్యుత్ పొదుపు మరియు నిల్వ ఉత్పత్తులు, విద్యుత్ వాహనాల బ్యాటరీలు, సంబంధిత సేవలు తెలంగాణలో అవసరమై ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పెట్టుబడులతో తరలి రావాలని ఆయన సూచించారు. తెలంగాణను ఎలక్ట్రానిక్ హబ్ గా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఫ్యూచర్ సిటీలో గ్రీన్ ఎలక్ట్రికల్ వెహికల్స్ కి అగ్రస్థానం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సులు అన్నీ ఎలక్ట్రిక్ వాహనాలుగా రూపుదిద్దాలని భావిస్తున్నామని, ఈ నేపథ్యంలో తోషిబా సేవలు అవసరమవుతాయన్నారు. అలాగే సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా బొగ్గుతో పాటు లిథియం వంటి ఇతర ఖనిజ తవ్వకాల లోనికి ప్రవేశించనున్నదని, లిథియం బ్యాటరీల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న తోషిబా సింగరేణితో కలిసి ముందుకు పోవచ్చని సూచించారు. తోషిబా ఉత్పత్తుల కేంద్ర సందర్శన ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు సమీపంలోని తోషిబా ఫ్యూయల్ సెల్ తయారీ యూనిట్ ను సందర్శించారు. న్యూక్లియర్ పవర్, థర్మల్ పవర్ ఉత్పత్తిలో వినియోగించే టర్బైన్లు, జనరేటర్ల తయారీ యూనిట్ ని పరిశీలించారు. ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్, ఇతర బ్యాటరీల తయారీ విధానాన్ని పరిశీలించారు.“తెలంగాణలో తోషిబాను మరింతగా విస్తరిస్తాం.రాష్ట్ర ఉపముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు సూచన మేరకు తోషిబా అధికారులు స్పందిస్తూ భారతదేశంలో కేవలం మూడు రాష్ట్రాల్లో మాత్రమే తాము తమ యూనిట్లను ప్రారంభించామని, దీనిలో తెలంగాణ ప్రముఖమైందన్నారు. తెలంగాణ రాష్ట్రం పరిశ్రమల స్థాపనకు, వ్యాపార విస్తరణకు ఎంతో అనుకూలంగా ఉన్నందున స్వయంగా కానీ రాష్ట్ర ప్రభుత్వంతో ఉమ్మడి భాగస్వామ్యంతో కానీ ఇక్కడ తమ పరిశ్రమలను విస్తరించేందుకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుత ఈవీ వెహికల్స్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింతగా పెంచుతామని, ప్లాంట్ విస్తరణకు ప్రయత్నిస్తామని తోషిబా అధికారులు తెలిపారు.అనంతరం శ్రీ భట్టి విక్రమార్క మల్లు మరియు ఇతర అధికారుల బృందం సాయంత్రం నాలుగు గంటలకు బుల్లెట్ ట్రైన్ ద్వారా అక్కడికి సుమారు 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒసాకా పట్టణానికి బయలుదేరింది. అక్కడ ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ పానాసోనిక్ ప్రధాన కార్యాలయాన్ని, పరిశ్రమల్ని సందర్శించనున్నారు.ప్రజా రవాణాలో జపాన్ బుల్లెట్ ట్రైన్ ప్రపంచానికే ఆదర్శం ప్రజా రవాణా వ్యవస్థలో జపాన్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందని శ్రీ భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. టోక్యో నగరం నుంచి ఆయన బుల్లెట్ ట్రైన్ లో మధ్యాహ్నం ఒసాకా పట్టణానికి బయలుదేరారు. 700 కిలోమీటర్ల పొడవైన ఈ రైలుమార్గాన్ని కేవలం కేవలం 2 గంటల 20 నిమిషాలలో బుల్లెట్ ట్రైన్ ద్వారా చేరుకున్నారు. ప్రయాణం ఎంతో సౌకర్యవంతంగా సాగిందని, ట్రైన్ లో సౌకర్యాలు ఎంతో బాగున్నాయని ఈ తరహా రవాణా వ్యవస్థను తెలంగాణలో కూడా అభివృద్ధి పరచడానికి

# ఇది మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. మూసీ లూటిఫికేషన్

-మొదటిపేజీ తరువాయి

కేటీఆర్ పేర్కొన్నారు.
ఈ సీఎం మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేని అసమర్థుడు అని కేటీఆర్ విమర్శించారు. డబ్బు సంచుల కోసమే మూసీ ప్రాజెక్టుకు రాహుల్ అనుమతి ఇచ్చారు. రేవంత్ రెడ్డి కాదు.. రాహుల్ గాంధీనే హైడ్రాను నడిపిస్తున్నారు. రాహుల్ వెనుకుండి పేదల ఇండ్లపైకి బుల్డోజర్ నడిపిస్తున్నారు. కేవలం డబ్బుల కోసమే మూసీ ప్రాజెక్టును రాహుల్ చేపట్టారు. బుల్డోజర్ ప్రభుత్వంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రాహుల్ ఎక్కడున్నారు..? మూసీ ప్రాజెక్టును ఏ కాంట్రాక్టర్‌కు ఇస్తారో త్వరలో బయటపెడుతా. కాంగ్రెస్‌కు నోట్ల కట్టలు కావాలి.. కానీ బాధితుల కష్టాలు పట్టవా..? అని కేటీఆర్ నిలదీశారు.

### కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు లాంటిది

కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు లాంటిదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బంగారు బాతును ఒకేసారి కోసుకుతినాలని కాంగ్రెస్ నేతలు చూస్తున్నారని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్ చాట్ చేశారు. రేపు ఎల్బీనగర్‌లో మూసీ నది పరివాహక ప్రాంతాల్లో పర్యటించేందుకు వెళ్తాం.. ఎవరైనా అడ్డు వస్తే ఏం చేయాలో అది చేస్తామని కేటీఆర్ అన్నారు. ఇక సూపర్ ధనిక మంత్రిపై దాడుల తర్వాత ఈడీ మౌనం ఎందుకు వహించింది..? ఐదు రోజులైనా ఈడీ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య బంధంలో ఇది ఒక నాటకమా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. డబ్బు సంచుల కోసమే మూసీ ప్రాజెక్టుకు రాహుల్ గాంధీ అనుమతి ఇచ్చాడు. రేవంత్ రెడ్డి కాదు.. రాహుల్ గాంధీనే



హైడ్రాను నడిపిస్తున్నారు. రాహుల్ గాంధీ వెనుక ఉండి పేదల ఇండ్లపైకి బుల్డోజర్ నడిపిస్తుండు. హైదరాబాద్ నగరంలో బుల్డోజర్ ప్రభుత్వంతో ప్రజలు చచ్చిపోతుంటే రాహుల్ గాంధీ ఎక్కడ చచ్చిపోయాడు? తెలంగాణలో చిన్నపిల్లగాడు పిలిచినా సరే వస్తాను అని చెప్పిన రాహుల్ గాంధీ.. ఇప్పుడు ఎక్కడ సచ్చాడో చెప్పాలని కేటీఆర్ ధ్వజమెత్తారు.

### కొండా సురేఖ దొంగ ఏడుపులు.. పెడబొబ్బలు దేనికి..? ప్రశ్నించిన కేటీఆర్

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ దొంగ ఏడుపులు.. పెడబొబ్బలు దేనికి..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ తరపున ఆమెపై ఎవరు మాట్లాడలేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్ చాట్ చేశారు.
ఇదే సోషల్ మీడియాలో మాపైన ట్రోలింగ్ పేరుతో దాడి జరగడం లేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కొండా సురేఖ గతంలో ఉచ్చ ఆగడం లేదా అని అనలేదా..? ఇంకా ఆమె గతంలో మాట్లాడిన బూతు మాటలు గుర్తు తెచ్చుకోవాలి. గతంలో ఇదే కొండా సురేఖ మాట్లాడిన వీడియోలు పంపిస్తా మీకు కావాలంటే.. ఇదే కొండా సురేఖ హీరోయిన్ల ఫోన్లు టాప్ చేశారని కామెంట్లు చేశారు. ఆమె ఆరోపణలు చేసిన వాళ్లు మహిళలు కాదా? వాళ్లకు మనోభావాలు ఉండవా? మాపైన అడ్డగోలు ఆరోపణలు చేసినప్పుడు మా ఇంట్లో ఉన్న మహిళలు బాధపడలేదా? ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలన్నీ మీకు, మంత్రులకు పంపిస్తా.. వెంటనే ముఖ్యమంత్రి నోటిని ఫినాయిల్ వేసి కొండా సురేఖ, మంత్రులు కలిసి కడగాలి అని కేటీఆర్ సూచించారు.

### సూపర్ ధనిక మంత్రిపై దాడుల తర్వాత ఈడీ మౌనం ఎందుకు..?

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు వరుసగా రెండు రోజులు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇండ్లు, కార్యాలయాలపై దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఈడీ దాడులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. సూపర్ ధనిక మంత్రిపై దాడుల తర్వాత ఈడీ మౌనం ఎందుకు వహించింది..? అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ఐదు రోజులైనా ఈడీ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య బంధంలో ఇది ఒక నాటకమా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈడీ వరుసగా రెండు రోజులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇండ్లు, కార్యాలయాలపై దాడులు చేస్తే కనీసం ఢిల్లీ పెద్దలెవరూ కూడా ఖండించలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సహచర మంత్రులు సైతం ముఖం చాటేసినట్టు స్పష్టంగా అర్థమవుతున్నది. ఈ అంశం ఇప్పుడు అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో చర్చనీయాంశంగా మారింది. ఇతర రాష్ట్రాల్లోని కాంగ్రెస్ నేతలు, ఆప్ వంటి కూటమి నేతలపై ఈడీ, సీబీఐ దాడులు జరిగితే కాంగ్రెస్ అగ్రనేతలు దర్యాప్తు సంస్థలు, కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడతారు. కానీ, పొంగులేటి విషయం లో సైలెంట్‌పై చర్చ జరుగుతున్నది.

## కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా

**హైదరాబాద్ :** తన కుటుంబ సభ్యుల పట్ల నిరాధార ఆరోపణలు చేసిన మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై హీరో నాగార్జున ఎక్స్ వేదికగా స్పందించారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు హీరో నాగార్జున పేర్కొన్నారు. రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలని, మీ ప్రత్యర్థులని విమర్శించేందుకు వాడుకోకండి అని కొండా సురేఖకు హితవు పలికారు. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలని గౌరవించండని సూచించారు. బాధ్యత గలిగిన పదవిలో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం అని నాగార్జున స్పష్టం చేశారు. తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవలిసిందిగా కోరుతున్నాను అని కొండా సురేఖకు నాగార్జున పేర్కొన్నారు.

## రాష్ట్రం, దేశం సుఖసంతోషాలతో ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా రేవంత్ పేర్కొన్నారు. దసరా ఉత్సవాలను మైసూర్‌లో కాకుండా స్వామిజీ తెలంగాణలో నిర్వహించడం రాష్ట్రానికి శుభసూచికమని ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ పేర్కొన్నారు. ఈ ప్రార్థనాలయాన్ని తెలంగాణ భక్తులే నిర్మించారని గణపతి సచ్చిదానంద స్వామిజీ అన్నారు. రేవంత్‌రెడ్డి ధీరుడని, బుద్ధిమంతుడని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. మరోవైపు హైదరాబాద్ మహానగరంలో సీవరేజ్ ఓవర్ ఫ్లో నివారణ, ఇంకుడు గుంతల నిర్మాణంపై వాటర్‌బోర్డు చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌ను సీఎం రేవంత్ ప్రారంభించారు. లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్ వద్ద మహాత్మగాంధీకి నివాళులర్పించిన అనంతరం స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించిన పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. ఇక సరోజినిదేవి ఆసుపత్రి ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణం కార్యక్రమాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ప్రతి వర్షపు చుక్కను భూగర్భ జలంగా మార్చాలని, అందుకు ప్రజలు తమ ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రేటర్ పరిధిలోని వాటర్‌బోర్డుకు చెందిన మొత్తం ఆపరేషన్ మెయింటనెన్స్ డివిజన్లలో సీజీఎం, జీఎంలు ఈ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించారు. కాగా, గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తల్లి కమలమ్మ మృతి పట్ల రేవంత్‌రెడ్డి సానుభూతి తెలిపారు. బుధవారం రాత్రి చర్లపల్లి డిడిజన్ రెడ్డి కాలనీలోని వారి నివాసానికి వెళ్లి రామ్మోహన్ దంపతులను ఆయన పరామర్శించారు.

## బీజేపీ నూతన యాక్షన్ ప్లాన్..

-మొదటిపేజీ తరువాయి

వెల్లబోసుకున్నారు. ఇళ్లు కోల్పోతే రోడ్డున పడే పరిస్థితి వస్తుందంటూ కిషన్ రెడ్డి ఎదుట కన్నీటి పర్యంతం అయ్యారు. సారూ.. మీరే దిక్కంటూ బోరున విలపించారు. ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, తమను ఇక్కడ్నుంచి పంపించవద్దంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో డబ్బులు ఖర్చు చేసి ఇళ్లు కట్టుకున్నామని చెప్పారు. ఇలాంటి పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదని అన్నారు. తమను ఆదుకునేందుకు ముందుకు రావాలిని కోరారు. అయితే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధితులను ఓదార్చారు. ఇళ్లు కూల్చే పరిస్థితి వస్తే తానే అడ్డుగా నిలబడి కాపాడతానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్య పడొద్దని, మీ అందరికీ బీజేపీ తోడుగా ఉంటుందని భరోసా కల్పించారు.
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ..” పేదలకు అండగా ఉండటం కోసమే మేము చేపట్టేబోయే భవిష్యత్తు ప్రణాళిక ఉంటుంది. ఈసారి మేము ఏదీ చెప్పి చేయం. హైడ్రా కూల్చివేతలపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదు. ఇళ్ల కూల్చివేతలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. ఇళ్ల కూల్చడంతో కేంద్రానికి ఏం సంబంధమో ఆయనే చెప్పాలి. ఇది రాజకీయాలు మాట్లాడే సమయం కాదు. పరస్పర రాజకీయ విమర్శలు తర్వాత చేసుకోవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం వల్ల వేలాది మంది పేదలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. పేదలకు అండగా ఉండటం కోసం జైలుకు వెళ్లేందుకైనా సిద్ధం. మూసీ బాధితులకు బీజేపీ అండగా ఉంటుంది. ఎవరూ భయపడాల్సిన పనిలేదు. మీ కోసం మేము నిలబడతాం. రేపట్నుంచే కొత్త కార్యచరణ అమలు చేయబోతున్నాం. కాంగ్రెస్ బుల్డోజర్లకు అడ్డుగా నిలబడతాం. మీ ఆస్తులకు నష్టం జరగనివ్వం” అని హామీ ఇచ్చారు.

## హైడ్రా వాటినే కూల్చివేస్తోంది

-మొదటిపేజీ తరువాయి

ఇంకా డీపీఆర్ రూపొందించని ప్రాజెక్టులో అవినీతి ఎలా జరుగుతుందో చెప్పాలని నిలదీశారు. మూసీని ప్రక్షాళన చేస్తామని గతంలో కేసీఆర్ కూడా చెప్పారని, ఇప్పుడు మాత్రం బీఆర్ఎస్ వాళ్లు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా కూల్చివేతలపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందన్నారు. తప్పుడు ప్రచారం చేసేవారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని చెరువులకు పూర్వవైభవం తీసుకు వస్తామన్నారు. కేసీఆర్ కనిపించడం లేదని, ఆయన ఎక్కడ ఉన్నారో చెప్పాలని కేటీఆర్‌ను ప్రశ్నించారు.

## కొండా సురేఖ బేషరతుగా క్షమాపణ చెప్పాలి.. హరీశ్‌రావు డిమాండ్



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. మంత్రి కొండా సురేఖ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ వాదనల్లో పసలేకే వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారన్న మార్గరెట్ థాచర్ కోట్‌ను ఈ ట్వీట్‌కు జతపరిచారు హరీశ్‌రావు. హీరో నాగచైతన్య విడాకులకు కేటీఆరే కారణమని మంత్రి కొండా సురేఖ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. హీరోయిన్లకు డ్రగ్స్ అలవాటు చేసిందే కేటీఆర్ అని ఆమె ఆరోపించారు. నాగచైతన్య, సమంత జంట విడిపోవడానికి కేటీఆర్ కారణమంటూ మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలపై నటుడు ప్రకాశ్ రాజ్ కూడా సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. ‘ఏంటీ సిగ్గులేని రాజకీయాలు.. సినిమాల్లో నటించే ఆడవాళ్లంటే చిన్నచూపా..? అంటూ ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొండా సురేఖ వ్యాఖ్యలను హీరో నాగార్జున కూడా ఖండించారు. రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలని, మీ ప్రత్యర్థులని విమర్శించేందుకు వాడుకోకండి అని కొండా సురేఖకు నాగార్జున హితవు పలికారు. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలని గౌరవించండని సూచించారు. బాధ్యత గలిగిన పదవిలో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం అని నాగార్జున స్పష్టం చేశారు. తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవలిసిందిగా కోరుతున్నాను అని కొండా సురేఖకు నాగార్జున పేర్కొన్నారు.

## రుణమాఫీ ఆలస్యం కావడంపై జగ్గారెడ్డి వివరణ


**డేటా సరిగా లేకపోవడం వల్లే రుణమాఫీ ఆలస్యమవుతోందని వెల్లడి**

**ఇప్పటికే రూ. 18 వేల కోట్లు మాఫీ చేశామన్న జగ్గారెడ్డి**

**ప్రధాని మోదీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారా? అని ప్రశ్న**

రైతులకు రుణమాఫీ ఆలస్యం కావడంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి స్పందించారు. తాము అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే రుణమాఫీ చేశామని, డేటా సరిగా లేకపోవడంతో మిగిలిన రుణమాఫీ ఆలస్యమవుతోందన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశామన్నారు. ఆర్థికంగా ప్రభుత్వం ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రూ. 18 వేల కోట్లు మాఫీ చేశామన్నారు. దాచుకోవడానికి ఏమీలేదని, డేటా సరిగా లేకపోవడం వల్లే మిగిలిన రుణమాఫీ కాలేదన్నారు. రుణమాఫీ జరగలేదని బీజేపీ నేతలు ఇందిరా పార్క్ వద్ద దీక్ష చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో తన ఉనికిని పెంచుకోవడానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తోందన్నారు. అందుకే తమ ప్రభుత్వంపై బురద జల్లుతోందన్నారు. విదేశాల నుంచి నల్లధనం తెస్తానని చెప్పిన ప్రధాని మోదీ దానిని తెచ్చారా? అని నిలదీశారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ చెప్పారని, ఆయన చెప్పిన ప్రకారం ఈ 11 ఏళ్లలో 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని... కానీ, ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని నిలదీశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న బీజేపీ ఆ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని చెప్పి, రెట్టింపు చేశారని ఆరోపించారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు తులం రూ. 28 వేలుగా ఉన్న బంగారం ఇప్పుడు రూ. 1 లక్షకు పెరిగిందని మండిపడ్డారు. అన్నింటి ధరలు పెంచినా ప్రజలు తమనే గెలిపిస్తున్నారని బీజేపీ వాళ్లకు కళ్లు నెత్తికెక్కాయని ధ్వజమెత్తారు. బీజేపీ వాళ్లలా నటన తమకు రాదని, తాము ప్రాక్టికల్‌గా ఉంటామన్నారు.

# మున్నూరు కాపు సంఘం అధ్యక్షులుగా తన్నీరు రాజేందర్






**2 ఓట్ల తేడాతో అధ్యక్షుడిగా విజయం**
**ప్రధాన కార్యదర్శిగా కొత్త మోహన్**
**కోశాధికారిగా అడువాల రవి**


**ధర్మారం, శుభ తెలంగాణ :** ధర్మారం మండల మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ప్రముఖ జర్నలిస్టు తన్నీరు రాజేందర్ విజయం సాధించారు. ధర్మారంలోని స్థానిక గౌతమ బుద్ధ ఫంక్షన్ హాల్ లో బ్యాలెట్ పద్ధతి ద్వారా నిర్వహించారు. మొత్తం 502 ఓట్లకు గాను 363 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా బరిలో నిలిచిన తన్నీరు రాజేందర్ కు 180 ఓట్లు, మంద శ్రీనివాస కు 178 ఓట్లు, ఆకరి సత్యంకు 5 ఓట్లు వచ్చాయి. దీంతో రెండు ఓట్ల తేడాతో తన్నీరు రాజేందర్ అధ్యక్షుడిగా విజయం సాధించారు. అలాగే ప్రధాన కార్యదర్శి పదవికి కొత్త మోహన్, కోశాధికారి పదవికి అడువాల రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల సంఘం అధికారులు చింతపండు నర్సింగం, ఆకారి రాజేశం, చింతపండు శేఖర్, మిట్ట తిరుపతి, ఆవుల శ్రీనివాస్ గెలుపు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా గత పక్షం రోజులుగా మండల స్థాయిలో సభ్యత్వ నమోదు నిర్వహించి, పటిష్ట పద్దతిలో ఎన్నికలు నిర్వహించిన అడహక్ కమిటీ సభ్యులు రాచూరి శ్రీధర్, పెంచాల రాజేశం, ఆవుల వేణు, దీటి శ్రీనివాస్, ఆకరి సత్యం, తన్నీరు రాజేందర్, కొత్త మోహన్ ఆధ్వర్యంలో కొత్త కమిటీని ఘనంగా సన్మానించారు. అన్ని గ్రామాల నుండి వచ్చిన మున్నూరు కాపు సంఘం సభ్యులు, పోలింగ్ లో పాల్గొనడంతో పాటు కొత్త కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ తమకు ఓటు వేసి గెలిపించిన మున్నూరు కాపు సంఘం కుల బాంధవులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధితో పాటు ప్రతి ఒక్కరికి ఇచ్చిన మాట ప్రకారం ఇన్సురెన్స్ సౌకర్యం వర్తింపచేస్తామని, మండలం లోని సభ్యత్వం పొందిన మున్నూరు కాపు బాందవులకు అన్ని వేళలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నుండి తరలి వచ్చిన మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, కులస్తులు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గానికి సన్మానం**

ధర్మారం మండల మున్నూరు కాపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గాన్ని దొంగతుర్తి మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అధ్యక్షుడిగా గెలుపొందిన తన్నీరు రాజేందర్, ప్రధాన కార్యదర్శి కొత్త మోహన్, కోశాధికారి అడువాల రవిలను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. దొంగతుర్తి గ్రామ మున్నూరు కాపు సంఘం సభ్యులు, కుల బాంధవులు పాల్గొన్నారు.

## భాజపా రాష్ట్ర పాలిత ప్రాంతాల్లో రైతులకు ఏక్కడైన రుణమాఫీ జరిగిందా

రైతుల విషయంలో రైతులది ముసలి కన్నీరు
కాంగ్రెస్ పార్టీ కూసుమంచి మండల సీనియర్ నాయకులు వనం మధుసూదన్ రావు



**ఖమ్మం శుభ తెలంగాణ** భాజపా రాష్ట్ర పాలిత ప్రాంతాల్లో రైతులకు రుణమాఫీ ఎక్కడైనా జరిగిందా చెప్పాలన్నాలని కాంగ్రెస్ పార్టీ కూసుమంచి మండలం సీనియర్ నాయకులు వనం మధుసూదన్ రావు అన్నారు. బుధవారం ఆయన కూసుమంచి మండల కేంద్రంలో మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర పాలిత ప్రాంతాల్లో ఎక్కడైనా రైతులకు రుణమాఫీ కానీ రైతు సంక్షేమం కానీ చేపట్టిందా తెలపాలని అన్నారు. భాజపా పార్టీ చేస్తున్న దొంగ దీక్షలను రైతులు నమ్మరన్నారు. ఏకకాలంలో రూ. 2లక్షల రుణాలు మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి కి దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో దొంగ దీక్షలకు బీజేపీ నేతలు దిగితే హైడ్రా పేరుతో డ్రామారావు హైడ్రామా చేస్తున్నారని మండిపడ్డారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసే బాధ్యత కాంగ్రెస్ దేనన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా రెండు పార్టీలకు సిగ్గు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన చేస్తుంటే గజినీ అయితే ప్రభుత్వ సంస్థలను తెగనమ్ముతూ కార్పొరేట్ పాలన చేస్తున్న మోడీ ఏమవుతారో చెప్పాలని కేంద్రమంత్రులు, రాష్ట్ర నాయకత్వాన్ని శేఖర్ యాదవ్ ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల మెప్పుకోసమే బీజేపీ, బీఆర్ఎస్ కలిసి నాటకం ఆడుతున్నాయన్నారు.

# గాంధీజీ ఆశయాలను సాధిద్దాం



**నార్నూర్ శుభ తెలంగాణ** జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న ఆశయాలను సాధిద్దామని సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గాంధీ కూడలిలో ఆయన జయంతి జరిపారు. ఆయన విగ్రహానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. భవిష్యత్తు తరానికి మహనీయుల గురించి తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో బంజారా సేవ సంఘం జిల్లా అధ్య క్షుడు రెడ్డి నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పుష్కర్ జ్ఞానోబా, మాజీ జడ్పీటిసి కర్మన్కార్ బ్రిజు లాల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ దాదే అలీ, పాక్స్ ఇంచార్జ్ చైర్మన్ సురేష్ ఆడే, ఎంపిడివో జవహర్ లాల్, పంచా యతీ సెక్రటరీ కుమ్ర మొతిరాం, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఉర్వేత రూప్ దేవ్, యశ్వంత్ రావ్, శివాజీ పటేల్, మాజీ ఉప సర్పంచ్ మహేందర్ చౌహాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవ్ రావ్ లోఖండే, ప్రణిత సుర్ సింగ్, అన్నాభావు సాటే కమిటీ అధ్యక్షుడు కోర్రల మహేందర్, బాబాఖాన్, ఫేరోజ్ ఖాన్, బాలాజీ జాదవ్, సురేష్, బిక్కు చౌహాన్, ప్రేమ్ సింగ్ చౌహాన్, సయ్యద్ ఖాసిం,విలాస్, షేక్ అహ్మద్, షేక్ హుస్సేన్,నూర్ సింగ్, రియజుద్దీన్, సంజయ్ ఆడే, దేవిక బాయి, భారత్ టీచర్, అవినాష్ ఆడే, ముషబ్బిర్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న సోషల్ మీడియా ఇంచార్జ్ బాణోతు ఈశ్వర్ నాయక్




**మఠంపల్లి శుభ తెలంగాణ** మఠంపల్లి మండలం చెన్నాయి పాలెంలో మహాత్మా గాంధీ 155 వ జయంతి వేడుకలను బుధ వారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ మరియు కార్యదర్శి విజయలక్ష్మి హాజరయ్యారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా ఇంచార్జ్ ఈశ్వర్ నాయక్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. గాంధీజీ దేశానికి స్వతంత్రం తెచ్చిన పోరాట యోధుడని కొనియాడారు. సంవత్సరానికి ఒకసారి వర్ధంతి జయంతి కార్యక్రమాలు చేయడమే కాకుండా గాంధీజీ చెప్పిన విషయాలను పాటిస్తూ ,ఆయన ఆశయాల సాధనకై యువత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధి హామీ మేట్ బానోతు నాగార్జున ఆశ వర్కర్ మంగమ్మ, అంగన్వాడీ టీచర్ ధనలక్ష్మి, ఆయా కైక, పంచాయితీ కార్మికులు మాలోతు కోటమ్మ మాలోతు బుజ్జి ,గ్రామ పెద్దలు నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాలం సింగ్ జయంతి



**నార్నూర్ శుభ తెలంగాణ** మాజీ జడ్పీటీసీ బానోత్ జాలం సింగ్ 83వ జయంతిని మండల కేంద్రంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ మాట్లాడుతూ లంబాడా సమాజ అభ్యున్నతి కోసం అయన ఎంతో కృషి చేశారని అన్నారు. మండల కేంద్రంలో విద్యాసంస్థలు నెలకొల్పడంలో ముఖ్యపాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేద్దామని అన్నారు. కార్యక్రమంలో బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పుష్కర్ జ్ఞానోబా, పాక్స్ ఇంచార్జీ చైర్మన్ సురేష్ ఆడే, యశ్వంత్ రావ్, మాజీ ఉప సర్పంచ్ మహేందర్ చౌహాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవ్ రావ్ లోఖండే, అన్నాభావు సాటే కమిటీ అధ్యక్షుడు కోర్రల మహేందర్, సయ్యద్ ఖాసిం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా గాంధీజీ జయంతి



**మఠంపల్లి శుభ తెలంగాణ :** గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని గాంధీ తాత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, అధికారులు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు కండే వెంకటేశ్వర్లు, వంగవేటి వేణుగోపాలరావు, కొత్త సత్యనారాయణ, గ్రామపంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రెడ్డి పరివార్ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు



**మఠంపల్లి శుభ తెలంగాణ :** మండల కేంద్రంలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలను రెడ్డి పరివార్ ఆధ్వర్యంలో బుధవారం వేణుగోపాలస్వామి ఆలయంలో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో అలరించారు. మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మను పేర్చి, గునుగు ,తంగేడు ,బంతి వంటి పూలతో బతుకమ్మను అంగరంగ వైభవంగా అలంకరించారు. చిన్నలు పెద్దలు అనే తేడా లేకుండా అందరూ భక్తి శ్రద్ధలతో ఘనంగా బతుకమ్మను జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల తో బతుకమ్మను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మన్నెం భారతమ్మ మరియు రెడ్డి పరివార్ సభ్యులు పాల్గొన్నారు

## ఏ రాష్ట్రంలో బీజేపీ రైతు రుణాలు మాఫీ చేసింది

కాంగ్రెస్ కిసాన్ సెల్ కూసుమంచి మండల అధ్యక్షుడు బాదావత్ నరేష్ నాయక్



**ఖమ్మం శుభ తెలంగాణ** కాంగ్రెస్ పార్టీ ఇచ్చే ఆరు గ్యారెం టీల్లో ఒక సంక్షేమ పథకమైనా బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో అమలు చేసిందా అని కాంగ్రెస్ కిసాన్ సెల్ కూసుమంచి మండల అధ్యక్షులు బాదావత్ నరేష్ నాయక్ ప్రశ్నించారు. ఏకకా లంలో రూ. 2లక్షల రుణాలు మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి,కి దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుం దన్న అక్కసుతో దొంగ దీక్షలకు బీజేపీ నేతలు దిగితే హైడ్రా పేరుతో డ్రామారావు హైడ్రామా చేస్తున్నారని కేఎస్ఆర్ మండి పడ్డారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసే బాధ్యత కాంగ్రెస్ దేనన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా రెండు పార్టీలకు సిగ్గు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు . సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన చేస్తుంటే గజినీ అయితే ప్రభుత్వ సంస్థలను తెగనమ్ముతూ కార్పొరేట్ పాలన చేస్తున్న మోడీ ఏమవుతారో చెప్పాలని కేంద్రమంత్రులు, రాష్ట్ర నాయకత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల మెప్పుకోసమే బీజేపీ, బీఆర్ఎస్, కలిసి నాటకం ఆడుతున్నాయ న్నారు .

## ఎంపీడీవో ఆఫీస్‌లో ఘనంగా గాంధీ జయంతి వేడుక



**ఖమ్మం శుభ తెలంగాణ** కూసుమంచి లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. హక్కుల సాధనకై శాంతియుత పోరాట మార్గాన్ని ఆచరణలో చూపించి ప్రపంచానికి అహింస సత్య గ్రహ సిద్ధాం తాలను అందించిన గాంధీ మార్గం ఎప్పటికీ ఆదర్శప్రాయం అని ఎంపీడీవో వేణు గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ పేరుతో పెద్ద కుట్ర జరుగుతుంది

మాల మహానాడు ఖమ్మం నగర వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం మల్లయ్య



**ఖమ్మం శుభ తెలంగాణ:** ఎస్సీ వర్గీకరణ చేసి మాల మాదిగలను విడదీయాలన్నది ఒక కుట్ర అయితే ఏకంగా రిజర్వేషన్ ఎత్తివేయా లనిది మరో కుట్ర జరుగుతుంది ఇలా జరిగితే దళితులంతా బానిసలయ్యే అవకాశం ఉన్నది కాబట్టి సుప్రీంకోర్టు ధర్మసానాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను పునరా ఆలోచన చేయాలని మేము కోరేది ఒకటే మాదిగల కంటే మాల మాల ఉపకులాలు ఎక్కువ ఉన్నప్పటికీ మాలలు తక్కువ ఉన్నారని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు కాబట్టి కులగణన చేసి లెక్కలు తేల్చే వరకు ఎస్సీ వర్గీకరణ విషయంలో దళితులకు అన్యాయం జరగకుండా న్యాయం జరిగే వరకు ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఆపాలని మాల మహానాడు ఖమ్మం నగర వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం పుల్లయ్య అన్నారు. ఇప్పటికైనా మాలలు మేలుకొనకపోతే రాబోయే తరా లకు బానిసత్వమే మిగులు తుందని మాల మేధావులు ఉద్యోగస్తులు కవులు కళాకారులు మరియు మాల సంఘాలు ఎన్ని ఉన్న అందరూ ఒకటై కలిసి ముందుకు రావాలని అన్నారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజలు భయపడే పరిస్థితి

**ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ప్రజలు చూసి భయపడే పరిస్థితి**
**మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**



**పెద్దపల్లిశుభ తెలంగాణ :** ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ప్రజలు చూసి భయపడే పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా సంబంధించిన దాదాపు లక్షమంది రైతులకు రుణమాఫీ కాలేదని, ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడం తో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ని కలిసి జిల్లా రైతుల ఆవేదనను వ్యక్తం చేసి, ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని వినతి పత్రాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ దాదాపు పెద్దపల్లి జిల్లా మొత్తం మీద రుణమాఫీ కావలసిన రైతుల సంఖ్య 1 లక్ష 52 వేల 184 ఉండగా, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది 51,393 మంది రైతులకు మాత్రమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం సమావేశంలో రాష్ట్రంలో మొత్తం మంది రైతులకు రుణమాఫీ జరిగిపోయిం దనీ, మా ప్రభుత్వం గొప్పగా చేసినమని స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పై ఇప్పుడు లెక్కకు లేని ఆంక్షలు పెడుతోందని అన్నారు. ఇది ఈ పెద్దపల్లి జిల్లా కు సంబంధించిన విషయం కాదనీ, రాష్ట్రంలోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రకటించింది 49 లక్షల మందికి ఎంతమందికి ఇచ్చింంద్రు రుణమాఫీ 23 లక్షల 25 వేల మంది ఇచ్చిండని, మిగిలిన రైతుల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు గడుస్తోన్న ఒక్క స్కీం అయిన సరిగా అమలు జరగడం లేదనీ గుర్తు చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ, రైతుభరోసా, మహిళలకు ఇచ్చే రూ.2500, ముసలవ్వలకు ఇచ్చే రూ.4 వేలు, రూ.500 రూపాయల బోనస్, కళ్యాణ లక్ష్మీ తులం బంగారం, ఇవన్నీ ఎక్కడికి పోయాయని ఎద్దేవా చేశారు. అన్ని మాయ మాటలు, దొంగ మాటలు, దగుల్బాజీ మాటలు మాట్లాడుతూ ఒక వైపు హైడ్రా పేరు మీద హైదరాబాద్ లోని భవనాలనుకోల్సి వేయడం దయానంగా మారిందన్నారు. ఆనాడు ఈ రేవంత్ రెడ్డి నువ్వే చెప్పావు కదా ఒక నిర్మాణాన్ని కూలగొట్టే ముందు దానికి చట్టాలు ఉన్నాయనీ, ఒకవేల రెగ్యులరైజ్ చేయాలనుకుంటే కూడా చేయవచ్చని చెప్పావు కదా అని కొప్పుల ఈశ్వర్ గుర్తుచేశారు. ఇప్పుడు వేరే దేశం ఇంకో దేశం పై దాడి చేసినట్లు దొంగల్లాగా తెల్లవారుజామున ఎవరు లేని సమయంలో హైడ్రా పేరు తో ఇండ్లను కూల కొడుతున్నావు ఇదో నీకు న్యాయమా..? నీ తప్పుడు నిర్ణయాల వల్ల ఎన్ని కుటుంబాలు రోడ్డున పడ్డారని, లక్షల మంది ఆవేదనలు వినపడటం లేదా అని ప్రశ్నించారు. 10 సంవత్సరాల కెసిఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం ఇలాంటి పరిస్థితి ఉందా అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 23 సార్లు డిల్లీ పోయచ్చింంద్రు ఈరోజు కూడా డిల్లీ లోనే ఉన్నాడు ఏం సాందించిండో తెలియదు.. కానీ కెసిఆర్ చెప్పింంద్రు మోసపోతే గోస పడతరని, కాని ఎవరు నమ్మలేదు కాంగ్రెస్ పార్టీ చెప్పిన అబద్ధాలను నమ్మి ఓటు వేస్తిరన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అస్తవ్యస్తమైన పరిపాలన నడుస్తోందన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లో రెసిడెన్షియల్ హాస్టల్లు నాష్టమైపోయాయి. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అందాకారం అయిపోయిం దన్నారు. ఆసుపత్రి పోతే మందులు లేవు కెసిఆర్ పాలనలో ప్రసవాలు 80 శాతం ప్రభుత్వం ఆసుపత్రిలో జరిగాయి.. ఈరోజు 33 శాతానికి తగ్గిపోయాయని అన్నారు. ఈ రాష్ట్రంలో దుర్మార్గమైన పాలనా కొనసాగుతున్నది. దీనికి చరమగీతం పాడాలంటే తప్పకుండా రైతు లోకమంతా ఏకం కావాలన్నారు. ఇది బిఆర్ఎస్ పార్టీ సమస్య కాదు. ఇది లక్షల మంది రైతుల సమస్య ఈ రాష్ట్రలో ఉన్నటువంటి అన్ని వర్గాల ప్రజల సమస్య కాబట్టి ఈ దుర్మార్గమైన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వేడుకగా ఇది అంతం కాదు ఆరంభం అని కొప్పుల ఈశ్వర్ ముఖ్యమంత్రి ని హెచ్చరించారు. రైతు ఏడ్చినా రాజ్యం ఎన్నడూ కూడా బాగుపడలేదు. ఈ రాష్ట్రంలో రైతులను ఏడిపిస్తున్నావన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓ పాపకారి ప్రభుత్వం అని ప్రజలకు తెలిసిపోయిందని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ , పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, మాజీ జెడ్పిటిసి గంట రాములు, నాయకులు దాసరి ఉష, మార్కు లక్ష్మణ్, మాజీ ఎంపీపీలు నునేటి సంపత్, బాలాజీ రావు, నాయకులు బండారి శ్రీనివాస్, అన్ని మండలాల మండల అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ రైతుబంధు కన్వీనర్లు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున రైతు సోదరులు పాల్గొన్నారు.

# కాప్రా డివిజన్ లో గాంధీ జయంతి సందర్భంగా ఉత్తమ కార్మికులకు ఘన సత్కారం.





**(కాప్రా/శుభ తెలంగాణ)** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని కాప్రా సర్కిల్ కాప్రా డివిజన్ లో మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికు లను గుర్తించి,వారి సేవలను ప్రశంసించడానికి జీహెచ్ఎంసీ అధికారులు ఉత్తమ పారిశుద్ధ్య( క్లీనింగ్)కార్మికులను మరియు ఉత్తమ చెత్త సేకరణ (సాట్ ఆటో) కార్మికులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి (వార్డ్-1) ముఖ్య అతిథిగా హాజరై, సర్కిల్ పరిధిలో సుదీర్ఘ కాలం పాటు సేవలు అందిస్తున్న కార్మికుల కృషిని ప్రశంసిస్తూ,వారిని సత్కరిం చారు. ఈ సందర్భంగా స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి ఇచ్చే సేవలు ఎంతో విలువైనవని,వారి కష్టాన్ని గుర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని "గాంధీజీ ఆశయాలను అనుసరించి పరిశుభ్రతను పాటించడం,దానిపై అవగాహన కల్పించడం చాలా ముఖ్యం.కాప్రా సర్కిల్లోని పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజు నిస్వార్థంగా పని చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతు న్నారని,వారి కృషి అభినందనీయమని" ఆయన కొనియా డారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబెర్ పవన్,మల్లా రెడ్డి, మహేష్ యాదవ్,సంతోషం చారీ,బాబు రావు.పారిశుద్ధ్య విభాగం సిబ్బంది జవాన్లు రామకృష్ణ, శ్రీనివాస్, దశరథ్, కృష్ణ,ఎస్ఎఫ్ఏ లు సంజీవ్,వసంత, కుమార్,స్థానిక ప్రజలు, మరియు ఇతర రాజకీయ నాయకులు పాల్గొన్నారు. సత్కరించ బడిన కార్మికులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.సన్మానం అందుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందని వారు తెలియజేశారు.

# రుణమాఫీపై రాద్ధాంతం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**కమాన్ పూర్శుభ తెలంగాణ :** కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ పై బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తుందని కమాన్ పూర్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వైనాల రాజు సింగల్ విండో చైర్మన్ మాజీ ఎంపీపీ కోలేటి మారుతీలు ఆరోపించారు. బుధవారం కమాన్ పూర్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మరియు మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు కొరుగంటి చందర్ దాసరి మనోహర్ రెడ్డిలు కలెక్టరేట్కు వెళ్లి సమర్పించడం విడ్డూరంగా ఉందని అన్నారు. గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో రైతులను ఏనాడు పట్టించుకోలేదని రుణమాఫీ చేస్తానని కేసీఆర్ చెప్పి దశలవారీగా తూతూ మంత్రంగా చేయడం జరిగిందని అన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడం జరిగిందని దీంతో బిఆర్ఎస్ వారికి మింగుడు పడక లేని ఆరోపణలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నాయని అన్నారు. ఇది రైతు ప్రభుత్వం ఆ ని స్పష్టం చేశారు. రుణమాఫీ క్రెడిట్ అంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి దంచడంతో టిఆర్ఎస్ నాయకులకు మింగుడు పడక కాంగ్రెస్ ప్రభుత్వం పై లేని ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ మల్యాల రామ్చరణ్ గౌడ్ గాండ్ల మోహన్ బొల్లంపల్లి తిరుపతి గౌడ్ ఆకుల ఓదెలు ఖద్గం రవీందర్ శీలాలపు మల్లయ్య కుక్క రవి పిడుగు నరసయ్య అరిసె ఎల్లయ్య పిడుగు శంకర్ తూండ్ల కనకయ్య భద్రపు శంకర్ ఇనగంటి పాపారావు చింతపండు మధు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మాగాంధీ జీవన విధానం ప్రతి ఒక్కరికి ఆదర్శం

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి:** మహాత్మాగాంధీ జీవన విధానం ప్రతి ఒక్కరికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహాత్మా గాంధీ జీవనం గురించి మనం చిన్నప్పటి నుంచి చదువుతు న్నామని అన్నారు. నేటి సమాజంలో మనందరం తొందరగా ఫలితాలు రావాలని ఆశిస్తున్నామని , గాంధీ జీవితంలో ఎప్పుడు షార్ట్ కట్స్ వెతుక్కోలేదని, న్యాయబద్ధం గా ఓపికతో పోరాడుతూ అనేక విజయాలు సాధించారని అన్నారు. స్వాతంత్ర ఉద్యమం లో భాగంగా జరిగిన క్విట్ ఇండియా, విదేశీ వస్త్రాల బహిష్కరణ మొదలగు ఉద్యమాలు ఒక్కరోజులో వచ్చినవి కావని, గాంధీ మహనీయులు ప్రతి రోజూ నమ్మిన సిద్ధాంతం ప్రకారం నిరంతరాయంగా చేసిన కృషి ఫలితంగా ఉద్యమాలు సఫలీకృతం అయ్యాయని, ఒక్కరోజులో ఫలితం రాలేదని కలెక్టర్ పేర్కొన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో గాంధీ జైలు శిక్ష అనుభవించడం వంటి అనేక కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ, లక్ష్యాన్ని సిద్ధాంతాన్ని మరిచిపోకుండా పోరాటం సాగించారని, దాని వల్ల ఆశించిన ఫలితం లభించి మన దేశానికి స్వాతంత్రం వచ్చిందని, దీనిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, నిరంతరాయంగా లక్ష్యం కోసం శ్రమిస్తే ఫలితం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. మన నిత్య జీవితంలో అనేక ఒత్తిడులు వస్తాయని, అటువంటి అవరోధాలను ఎదుర్కొంటూ మన లక్ష్యాల సాధనకు నిరంతరాయంగా శ్రమించాలని అన్నారు. అనంతరం మహాత్మ గాంధీ స్మారక నిధి వారు రూపొందించిన మహాత్మ గాంధీ సూక్తుల పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, డి.ఎం. అండ్ హెచ్. ఓ. డాక్టర్ ప్రమోద్ కుమార్, ఇతర జిల్లా అధికా రులు, కలెక్టరేట్ సి. సెక్షన్ పర్యవేక్షకులు ప్రకాష్, స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జిల్లా అధ్యక్షులు బాలసాని వెంకటేశం, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర పోరాటంలో కీలక పాత్ర వహించిన గాంధీ మహాత్ముడు

**కమాన్పూర్శుభ తెలంగాణ :** స్వాతంత్ర పోరాటంలో కీలకపాత్ర వహించిన వారిలో గాంధీ మహాత్ముడు ఒకరని కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు మాజీ ఎంపీపీలు కోలేటి మారుతి మల్యాల రామ్ చంద్రంగౌడ్ అన్నారు. బుధవారం కమాన్ పూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు ఆధ్వర్యంలో గాంధీ మహాత్ముని జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో అహింస శాంతి అనే ఆయుధాలను ఉపయోగించి ఆయన భారతదేశం నుండి బ్రిటన్ పాలనను ముగించారు అని పేర్కొన్నారు భారతదేశ చరిత్రలో ఇది అరుదైన ఘట్టం అని అన్నారు ప్రపంచవ్యాప్తంగా గాంధీ చెప్పిన శాంతి న్యాయం సమానత్వం అనే ఉద్యమాలను ప్రేరేపించారు. ఈ కార్యక్రమంలో గాండ్ల మోహన్ బొల్లంపల్లి తిరుపతి గౌడ్ కటకం రవీందర్ ఆకుల ఓదెలు శీలారపు మల్లయ్య కుక్క రవి అరిసె ఎల్లయ్య పిడుగు నరసయ్య పిడుగు శంకర్ తూండ్ల కనకయ్య బాద్రాభిషేకం ఇనగంటి పాపారావు చింతపండు మధు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల తహసీల్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకల్లో కిరణ్ గోస్కుల రజిత చిరంజీవి కట్ట కుమార్ అలాగే ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎంపీ ఓ భాస్కర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ గాంధీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం..

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**రాజన్న సిరిసిల్ల :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ చిత్రపటానికి పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన జిల్లా ఎస్పీ అనంతరం ఎస్పీ మాట్లాడుతూ. సత్యం, అహింస సత్యాగ్రహం అనే మూడు ఆయుధాలతో బ్రిటిష్ వారిపై పోరాటం చేసి దేశానికి స్వతంత్రం తీసుకొచ్చిన గొప్ప యోధుడు గాంధీ ఆయన సూచించిన శాంతి, అహింస, సత్యం మార్గంలో ముందుకు సాగుతూ ఆయన నమ్మిన సిద్ధాంతాలను విలువలను నిబద్ధతతో ఆచరిస్తూ గాంధీ కీర్తి ప్రతిష్టలు విశ్వవ్యాప్తం చేయాలన్నారు. నేటి యువతరం గాంధీ జీవన మార్గాన్ని అనుసరిస్తూ దేశ అభివృద్ధి కోసం నిస్వార్థంగా సేవలు అందించాలని కోరారు. గాంధీ లాంటి గొప్ప నాయకున్నీ ఆదర్శంగా తీసుకుని కష్టపడే తత్వం అలవర్చుకోవాలని ప్రజలకు సేవ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ, సి.ఐ శ్రీనివాస్, ఆర్.ఐ లు మధుకర్, యాదగిరి, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## నివాళులు అర్పించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రాజన్న సిరిసిల్లశుభ తెలంగాణ:** స్వాతంత్ర్య సమర యోధుడు, జాతిపిత మహాత్మగాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాల యాల సము దాయంలో మహాత్మగాంధీ జయంతి వేడుకలు నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఉన్నతాధికారులు జాతిపిత చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సిరిసిల్ల లోని గాంధీ చౌక్ లో ఉన్న మహాత్మగాంధీ విగ్రహానికి కలెక్టర్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఇక్కడ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## మూసీ బాధితుల హర్షం!

**డబుల్ బెడ్ రూమ్ కేటాయింపు...!**

**హైదరాబాద్ :** కొత్తపేట భవానీ నగర్ లో మూసీ పరీవాహకంలో నివసిస్తున్న పదకొండు కుటుంబాలకు వనస్థలిపురం డబల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించారు. ఇంటి నుంచి సామానుతో సహా షిఫ్ట్ అయ్యారు. మల్కాజిగిరి ఆర్డీవో శ్యాంప్రకాశ్ వారికి ఇంటిని కేటాయిస్తున్నట్లు పట్టాలు అందించారు. బాధితులు మాట్లాడుతూ.. ఇన్ని మురికివాడల్లో ఇబ్బందులు పడ్డామని, తమకు ఇళ్లు కేటాయించినందుకు సీఎంకు రుణపడి ఉంటామని హర్షం వ్యక్తం చేశారు.

## హమాలిల బదిలీలు.. ఆందోళన

**ఖమ్మం, :** వందమంది హమాలి కూలీలను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం పట్ల హమాలీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మం నగరంలోని ఎఫ్సీఐ గోడౌన్ వద్ద హమాలీల సమావేశం నిర్వహించారు. హమాలీల హక్కుల కోసం పోరాటం చేసేందుకు సిఐటియు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ రావు హాజరయ్యారు. ఎఫ్సిఐ గొడౌన్ లో పని చేస్తున్న కూలీలను బదిలీ చేయడం ఏంటని, అసలు హమాలీ కూలీలను ఎఫ్సీఐ బదిలీ ఎలా చేస్తుందని ఎఫ్సీఐను సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ప్రశ్నించారు. ఎఫ్సిఐ కూలీల బదిలీ ఆదేశాలను వెనక్కు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. హమాలి కూలీల బదిలీలపై స్థానిక మంత్రులు, ఎంపీ జోక్యం చేసుకుని హమాలీ కూలీల బదిలీలను వెనక్కు తీసుకునేలా చేయాలని కోరారు. హమాలి కూలీల బదిలీ విషయంలో ఎఫ్సిఐ గొడోన్ అధికారులు సానుకూలంగా స్పందించకుంటే అన్ని ట్రేడ్ యూనియన్ ల ఆధ్వర్యంలో ఎఫ్సిఐ గోడౌన్ వద్ద 4 వ తేదీన ధర్నాకి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం నాయకులు ఎర్ర శ్రీకాంత్, మల్లికార్జున్, ఎఫ్సిఐ వర్కర్స్ ఖమ్మం జిల్లా కమిటీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నారాయణా కాలేజీలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ తనిఖీలు


**మెదక్, శుభ తెలంగాణ :** మేడ్చల్ జిల్లా బాచుపల్లి లోనీ నారాయణ మహిళా కాలేజీలో తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద ఆకస్మిక తనిఖీలు చేసారు. విద్యార్థినుల సౌకర్యాలు సదుపాయాల గురించి విద్యార్థులచే అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు,,బెడ్ రూమ్లు,వాష్ రూమ్లు పరిశీలించి వంట గది ని తనిఖీలు చేసారు. విద్యార్ధునుల వాష్ రూమ్ సరిగా లేదు, దుర్వాసనలు వస్తున్నాయని,బెడ్ రూమ్ లు లో పరుపుల మీద పురుగులు తిరుగుతున్నాయని,,వంట గది అపరిశుభ్రంగా ఉందని, భోజనం లో జిల పురుగులు వస్తున్నాయని,,,800 మంది విద్యార్దునిలు 5 ఫ్లోర్లు ఎక్కి దిగుతున్నారని లిఫ్ట్ సదుపాయం లేదని, ఎవ్వరికి ఆరోగ్యాలు సరిగా కూడ లేదని ఆమెతో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నేటి బాలికలే రేపటి భావి తరాలకు ఆశా జ్యోతులు అని భారీ డైలాగ్స్ చెప్పడం కాదు ,,,వారికి బంగారు భవిష్యత్తు అందివ్వాలని సదుద్దేశంతో తనిఖీలు నిర్వహించామని,, ఇప్పటికీ కైనా విద్యార్థులందరికీ నాణ్యమైన భోజనం,,,సరైన సదుపాయాలు అందచేయాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని ఆమె కళాశాల యాజమాన్యాన్ని హెచ్చరించారు

## పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపిలు

**దత్తాత్రేయనగర్లో టిటి ఇంజక్షన్ వికటించి వృద్ధురాలి నరకయాతన**

**మేడ్చల్శుభ తెలంగాణ :** పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న ఆర్ఎంపీ డాక్ట ర్లతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. వచ్చిరాని వైద్యం చేయడంతో అది కాస్త వికటించి ప్రాణాలు దక్కించుకోవడం కోసం అప్పుల పాలయ్యి పెద్ద ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం చింతల్, దత్తాత్రేయ నగర్ లో నివాసముండే పుష్ప (65) వృద్ధురాలు అనా రోగ్య సమస్యలతో ఇటీవల వైద్యం కోసం స్థానికంగా ఉన్న తేజ క్లినిక్ వెళ్ళింది. అక్కడ ఆమెను పరీక్షించిన ఆర్ఎంపి డాక్టర్ మూర్తి, వృద్ధురాలు కి సురక్షితం లేని టిటి ఇంజక్షన్ తో 'వైద్యం చేశారు. అది కాస్త వికరించడంతో ఆమె చేతికి, తుంటి కి దురద ఏర్పడి రంధ్రాలు పడేవిధంగా తయారయింది. నాసిరకం ఇంజక్షన్లతో చికిత్స అందించటంతో, వృద్ధురాలు పుష్ప కి తుంటి పై భాగం లో రంధ్రాలు పడ్డాయాని స్థానికులు తెలుపారు. వైద్యం వికటించడం వల్లనే వృద్ధురాలు పుష్ప తీవ్ర అనారోగ్యం బారిన పడిం దని, తను వొంటరి గా ఉండే మహిళ కావడం తో స్థానికులే మెరుగైన చికిత్స నిమిత్తం సూరారం లోని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మరో ఘటన జరగకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇలాంటి కనీస అవగాహన లేకుండా, క్లినిక్ లో పేరుతో చలామణి అవుతున్న ఆర్ఎంపి డాక్టర్ల పై ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవా లని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


# పచ్చి అరటిపండుతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటే..



డెయిలీ డైట్ లో పండ్లను తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదంటున్నారు వైద్యనిపుణులు. అందుకే రోజూ పండ్లను తినాలని వైద్యులు సూచిస్తుంటారు. పండ్లలో అనేక రకాల పోషకాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని బలోపేతం చేసి వ్యాధులతో పోరాడే శక్తిని ఇస్తాయి. యాపిల్, ఆరెంజ్, జామ, దానిమ్మ ఇలా ఎన్నో పండ్లను తినడం ద్వారా శరీరానికి లెక్కలేనన్ని పోషకాలు అందుతాయి. అలాంటిదే మరో పండు ఉంది. దీనిని పచ్చిగా కూడా తినవచ్చు. ఇంతకీ అది ఏంటి అనుకుంటున్నారా అదే పచ్చి అరటి పండ్లు. ఈ పండు ఓ ఆరోగ్య నిధి అని చెబుతుంటారు ఆయుర్వేద వైద్యనిపుణులు. పండిన అరటిపండులో విటమిన్లు, ఐరన్, ప్రొటీన్, మెగ్నీషియం, ఫైబర్, పొటాషియం, కాపర్ వంటి పోషకాలు ఉన్నప్పటికీ, పచ్చి అరటి పండులో పోషకాల నిల్వలు అనేకం ఉన్నాయి. పచ్చి అరటి అనేక వ్యాధులను నివారిస్తుంది. అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనాన్ని అందించడానికి కూడా పనిచేస్తుంది. పచ్చి అరటిపండు వల్ల కలిగే కొన్ని అద్భుత ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. క్యాన్సర్ నివారణ.. చీజదీ×(తీవట) ప్రకారం పచ్చి అరటిపండ్లలో ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ యాంటీ ఆక్సిడెంట్లు ఆరోగ్యకరమైన కణాలను ఆక్సీకరణ నష్టం నుండి రక్షించడానికి కూడా పని చేస్తాయి. ఆకుపచ్చ అరటిపండ్లలో బీటా కెరోటిన్, లుటిన్, జియాక్సంతిన్ వంటి ఇతర ఫైటోన్యూట్రియెంట్‌లతో పాటు విటమిన్ సి కూడా ఉంటుంది. అతిసారం..పచ్చి అరటి పండ్లు తినడం వల్ల అతిసారం నుంచి ఉపశమనం కలుగుతుంది. ఇది భారీ మొత్తంలో పోషకాలను కలిగి ఉంటుంది. అందుకే పచ్చి అరటి పండ్లు తినడం వల్ల వాంతులు, వికారం, అలసట మొదలైన సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

రక్తంలో షుగర్..డయాబెటిక్ రోగులు పచ్చి అరటి పండ్లను తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా ఉంటుందంటున్నారు నిపుణులు. ఇది రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుతుంది. ఇందులో ఉండే పెక్టిన్, రెసిస్టెంట్ స్టార్చ్ రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి పని చేస్తుంది. ఊబకాయం.. బరువు తగ్గడానికి, పచ్చి అరటి పండ్లు కూడా తినవచ్చు. ఇందులో పెద్ద మొత్తంలో ఫైబర్ ఉంటుంది. మీరు దీన్ని ఉడికించి తినవచ్చు. దీన్ని తినడం వల్ల కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. అతిగా తినకుండా ఉండొచ్చు. అందుకే పచ్చి అరటిపండుతో చాలా తక్కువ సమయంలో మీ పెరుగుతున్న బరువును నియంత్రించవచ్చు.మరిన్ని ప్రయోజనాలు.. పచ్చి అరటి పండ్లు తినడం వల్ల జీర్ణవ్యవస్థ కూడా బలపడుతుంది. ఇది అనేక పొట్ట సంబంధిత సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. మలబద్ధకం, గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు ఉంటే, ఉడకబెట్టిన పచ్చి అరటి పండ్లు తినడం వల్ల ఈ సమస్యలన్నీ పరిష్కరించవచ్చంటున్నారు. అధిక రక్తపోటు.. పచ్చి అరటిపండులో పొటాషియం ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతే కాదు ఇందులో మంచి పరిమాణంలో ఒమేగా 3, కొవ్వు ఆమ్లాలు, ఫైబర్ కూడా ఉన్నాయి. రక్తపోటును అదుపులో ఉంచుకోవడం వల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుందంటున్నారు నిపుణులు.

# సోంపు -వాము కలిపిన నీటిని తీసుకోవడం వల్ల ఈ సమస్యలకు చెక్



సోంపు, వాము గింజల మిశ్రమాన్ని రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే తాగడం వల్ల బోలెడు లాభాలున్నాయని వివరిస్తున్నారు నిపుణులు. ఈ మూలికా సమ్మేళనాన్ని దినచర్యలో చేర్చుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం, మొత్తం శ్రేయస్సు కోసం అనేక ప్రయోజనాలను అందించవచ్చని చెప్తున్నారు. అయితే దుష్ప్రభావాలు కూడా లేకపోలేదని హెచ్చరిస్తున్నారు. మెరుగైన జీర్ణక్రియ : సోంపు, వాము నీటిని తాగడం వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాల్లో ఒకటి జీర్ణక్రియపై సానుకూల ప్రభావం. ఫెన్నెల్, క్యారమ్ గింజలు జీర్ణ ఎంజైమ్‌లను ఉత్తేజపరిచే లక్షణాలను కలిగి ఉంటాయి. పోషకాల విచ్ఛిన్నం, శోషణను మెరుగుపరుస్తాయి. ఇది ఉబ్బరం, గ్యాస్ వంటి సాధారణ జీర్ణ సమస్యల నుంచు ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. ఫెన్నెల్ గింజలు వాటి కార్మినేటివ్ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. ఇవి జీర్ణవ్యవస్థను ఉపశమనానికి, చిక్కుకున్న గ్యాస్‌ను బయటకు పంపడానికి సహాయపడతాయి. కాగా అజ్వైన్ గింజలు మొత్తం జీర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్ మెయింటైన్ : ఈ మిశ్రమం రెగ్యులర్ వినియోగం కొలెస్ట్రాల్ తగ్గించడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి తోడ్పడే, జీవక్రియను మెరుగుపరిచే సమ్మేళనాలు దీనికి కారణమని చెప్పవచ్చు. పీరియడ్ పెయిన్ నుంచి ఉపశమనం: రుతు నొప్పితో బాధపడుతున్న మహిళలు ఈ మిశ్రమం నీటితో ఉపశమనం పొందవచ్చు. ఈ గింజలలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, అనాల్జేసిక్ లక్షణాలు రుతుస్రావంతో సంబంధం ఉన్న నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి. ఇమ్యూనిటీ-బూస్టింగ్ ఎఫెక్ట్స్ : హెర్బల్ మిశ్రమంలో ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కూడా ఉన్నాయి. ఇవి శరీరంలో వాపును తగ్గించడంలో సహాయపడతాయి. అదనంగా రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది, అనారోగ్యాలు, ఇన్ఫెక్షన్ల నుంచి శరీరాన్ని కాపాడుతుంది. శ్వాసకోశ ఆరోగ్యానికి మద్దతు : వాము విత్తనాలు సాంప్రదాయకంగా శ్వాసకోశ ఆరోగ్యానికి మద్దతుగా ఉపయోగించబడుతున్నాయి. ఇవి పెక్టరెంట్‌లుగా పనిచేస్తాయి. దగ్గు, జలుబు లక్షణాల నుంచి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది

## నోని పండు తింటే.. కలిగే బోలేడు ఆరోగ్య ప్రయోజనాలు



నోని పండు చూడటానికి బంగాళాదుంప ఆకారంలో, పసుపు, లేత ఆకుపచ్చ రంగులో ఉంటుంది. దీని లోపల చిన్నచిన్న గింజలు ఉంటాయి. ఈ పండులో విటమిన్ సి, బయోటిన్, ఫోలేట్, విటమిన్ ఇ, మొక్కల ఆధారిత ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో కూడిన ఆర్గానికి యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడంతోపాటు ఆరోగ్యకరమైన కణాలను ఆక్సీకరణం మరియు దెబ్బతినకుండా కాపాడతాయి. వ్యాయామానికి ముందు.. నోని జ్యూస్ తాగితే శరీరానికి పుష్కలంగా శక్తి అందుతుంది. శక్తి స్థాయిలను పెంచుతుంది, కండర కణాలు అరిగిపోకుండా కాపాడుతుంది. నోని పండ్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది ఫైటో న్యూట్రియెంట్ల స్టోర్ హౌస్ అని అంటున్నారు. ఇవి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. ఇవి శరీరంలోని వివిధ జీవరసాయన ప్రతిచర్యలకు ఆహారాన్ని శక్తిగా మార్చడం ద్వారా సరైన జీవక్రియను సంరక్షించడంలో సహాయపడతాయి. నోని పండ్లలో.. పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ఇది హైపర్‌టెన్షన్‌ను తగ్గించడానికి, రక్తపోటును కంట్రోల్‌లో ఉంచడానికి, లక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుకోవడానికి, శరీరంలోని రక్త నాళాలు, రక్త ప్రసరణను ఆరోగ్యంగా ఉంచడానికి పొటాషియం సహాయపడుతుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్, గౌట్, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యల్లో కీల్ల నొప్పులను తగ్గించడానికి నోని జ్యూస్ అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ ఒకటి నుంచి రెండు గ్లాసుల నోని జ్యూస్ తాగితే.. బంధన కణజాలం వశ్యత మెరుగుపడుతుంది. దీనిలోని యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు.. వాపును తగ్గించి నొప్పి నుంచి ఉపశమనం ఇస్తాయి

# సంపూర్ణ ఆరోగ్యానికి పచ్చికొబ్బరి..



కొబ్బరి చట్నీ, సాంబార్ వంటి వివిధ ఆహారాలలో పచ్చి కొబ్బరి ప్రతిరోజూ ఉపయోగిస్తుంటాం. అయితే దీనిని పచ్చిగా తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. కొబ్బరిలో విటమిన్ ఇ, విటమిన్ బి, విటమిన్ సి, కాల్షియం, ఐరన్, ఫాస్పరస్, మినరల్స్... వంటి ఆరోగ్యకరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికే కాదు అందం పోషణలో కూడా పనిచేస్తుంది. కొబ్బరిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీవక్రియను మెరుగుపరుస్తుంది. కడుపు ఉబ్బరం, మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తాయి. జీర్ణక్రియ పనితీరును మెరుగుపరుస్తుంది. కొబ్బరిలో ఉండే విటమిన్లు, మినరల్స్ జుట్టు ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా చర్మాన్ని ఆరోగ్యంగా, యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. చర్మంపై ముడతలు, ముఖంపై మచ్చలు పోగొట్టి సూర్యకిరణాల నుంచి చర్మాన్ని కాపాడుతుంది.కొబ్బరిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, వివిధ విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. పచ్చి కొబ్బరిని తినడం వల్ల ఆరోగ్యకరంగా బరువు తగ్గవచ్చు. ఇది ఆకలిని నియంత్రిస్తుంది. అతిగా తినడం తగ్గిస్తుంది. ఇది అధిక కేలరీల తీసుకోవడం నిరోధిస్తుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. కొబ్బరిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇది మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడం, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. పచ్చి కొబ్బరిలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇది రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. అంటువ్యాధులు, వైరస్లు, హానికరమైన బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడుతుంది. పచ్చి కొబ్బరిలో కాల్షియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల దృఢత్వానికి తోడ్పడతాయి. అందువల్ల దీని రెగ్యులర్ వినియోగం బోలు ఎముకల వ్యాధితో సహా ఎముక సంబంధిత రుగ్మతలను నివారిస్తుంది.

# ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన విషయాలు!



రోజు ప్రారంభం బాగుంటే మన రోజంతా బాగానే సాగుతుందని అంటారు. కానీ నేటి బిజీ లైఫ్‌లో మనం రోజులోని అతి ముఖ్యమైన అల్పాహారం. అయితే చాలా మంది ఉన్నట్టుండి అల్పాహారం మానేస్తారు. ఈ అలవాటు చాలా కాలంగా కొనసాగడం వల్ల శరీరంలో పోషకాల లోపం ఏర్పడుతుంది. క్రమంగా మన శరీరం వ్యాధులకు నిలయంగా మారుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఉదయం అల్పాహారం తీసుకోవడం వల్ల మీ శరీరానికి గ్లూకోజ్ అందుతుంది. ఇది శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిని నిర్వహిస్తుంది. అదే సమయంలో అల్పాహారం ఎక్కువ రోజులు మానేయడం వల్ల శరీరంలో రక్తంలో చక్కెర స్థాయి తగ్గుతుంది. దీని కారణంగా టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఒక నెల పాటు నిరంతరంగా ఉదయం అల్పాహారం తీసుకోకపోవడం వల్ల మన ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసుకుందాం.చిరాకు: నిపుణుల అభిప్రాయం ప్రకారం.. న్యూరోట్రాన్స్మిటర్ సెరోటోనిన్ మన మానసిక స్థితిని చాలా వరకు ప్రభావితం చేస్తుంది. ఇది మన అల్పాహారం ద్వారా ప్రభావితమవుతుంది. మనం ఒక నెలపాటు బ్రేక్‌ఫాస్ట్‌ని నిరంతరం తీసుకోకపోతే, సెరోటోనిన్ స్థాయిలు దెబ్బతింటాయి. దీని కారణంగా చిరాకు, ఆందోళన, నిరాశ లక్షణాలు కూడా పెరుగుతాయి.బరువు పెరుగుట: అల్పాహారం దాటవేయడం వల్ల బరువు తగ్గడం కంటే అనారోగ్యకరమైన బరువు పెరిగే ప్రమాదం ఉంది. అల్పాహారం లేనప్పుడు, తరచుగా మధ్యాహ్న భోజనంలో ఎక్కువగా తింటాము. ఇది బరువు పెరగడానికి కారణం కావచ్చు. మెటబాలిక్ సిండ్రోమ్: అల్పాహారం తీసుకోకపోవడం మెటబాలిక్ సిండ్రోమ్ ప్రమాదాన్ని పెంచుతుంది. ఇది గుండె జబ్బులు, స్ట్రోక్, టైప్ 2 దయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతుంది. గుండె జబ్బులు వచ్చే ప్రమాదం: అల్పాహారం తీసుకోని వారికి గుండెపోటు, రక్తపోటు, మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల, మీ గుండె ఆరోగ్యంగా ఉండటానికి అల్పాహారం తీసుకోవడం మర్చిపోవద్దు.టైప్ 2 దయాబెటిస్:అల్పాహారం మానేస్తే టైప్ 2 దయాబెటిస్ రిస్క్ పెరుగుతుంది. అల్పాహారం మానేయడం వల్ల శరీరంలో బ్లడ్ షుగర్ నియంత్రణలో ఉండదు. ఇది దయాబెటిస్ ప్రమాదానికి దారి తీస్తుంది.పోషకాల కొరత: ఉదయం అల్పాహారం శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. ఉదయం అల్పాహారం తీసుకోకపోతే, మన శరీరంలో విటమిన్లు, మినరల్స్, ఫైబర్ వంటి అవసరమైన పోషకాలు లోపించవచ్చు. ఇది అనేక వ్యాధులకు కారణం కావచ్చు.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110